
# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 246 | హైదరాబాద్ | బుధవారం 25-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00


హర్మూజ్ జలసంధి, ఖర్గ్ ఐలాండ్ అంశాలపై 40 ఏళ్ల క్రితమే ట్రంప్ పత్రికా ప్రకటన

11లో



11లో

రాజమహేంద్రవరంహైదరాబాద్

## మధ్య మూడు కొత్త విమాన సర్వీసులు

- ఈ సర్వీసులను ఈ నెల 29 నుంచి ప్రారంభించనున్న ఫ్లై 91 ఎయిర్‌లైన్స్
- రోజుకు మూడు వేర్వేరు సమయాల్లో అందుబాటులోకి ఈ సర్వీసులు
- రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న విమాన కనెక్టివిటీ

## సర్వర్లలో సాంకేతిక లోపం..

తెలంగాణలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ




- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- ఆగిపోయిన స్లాట్ బుకింగ్, చలాన్ల చెల్లింపులు
- ఇబ్బందిపడుతున్న కొనుగోలుదారులు, విక్రేతలు

11లో

## పశ్చిమాసియా పరిస్థితులు..
## రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటన

- పశ్చిమాసియా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామన్న మోదీ
- ముడి చమురు, గ్యాస్, ఎరువులకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకున్నట్లు వెల్లడి
- హర్మూజ్ మీదుగా భారత్ చమురు నౌకలు వస్తున్నాయన్న మోదీ



## పశ్చిమాసియాలో ఆగిపోనున్న యుద్ధం.. ఇరాన్ కీలక నిర్ణయం..?

11లో



11లో


మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు

## పాపారావు లొంగుబాటు

- బస్తర్‌లో కీలక పరిణామం
- పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు కమాండర్ పాపారావు
- ఆయుధాలతో పాటు 17 మంది అనుచరుల లొంగుబాటు
- బస్తర్‌లో సాయుధ నక్సలిజం అంతమైందన్న ప్రభుత్వం
- ఇక ఇద్దరు అగ్రనేతలు మాత్రమే మిగిలారన్న హోం మంత్రి

## ఉప్పల్ స్టేడియానికి కొత్త కళ..
## రూ.10 కోట్లతో అభివృద్ధి చేసిన సన్ గ్రూప్

- హైదరాబాద్ స్టేడియంలో భారీ మార్పులు.. మెరుగైన సౌకర్యాలు
- టాయిలెట్లు, బాక్సులతో పాటు కొత్తగా లిఫ్టులు, ఏసీల ఏర్పాటు
- సన్ గ్రూప్ ఆధ్వర్యంలో భారీ ఆధునికీకరణ పనులు
- సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంఛైజీ



11లో



11లో

ఇరాన్ భద్రతా మండలి నూతన అధిపతిగా

## మహ్మద్ జోల్‌ఘదర్

- ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కొత్త సెక్రటరీగా మహమ్మద్ జోల్‌ఘదర్
- అలీ లారిజానీ మృతి నేపథ్యంలో ఈ కీలక నియామకం
- జోల్‌ఘదర్ గతంలో ఐఆర్‌జీసీలో బ్రిగేడియర్ జనరల్‌గా పనిచేసిన వైనం
- దేశ రక్షణ, అణు, విదేశాంగ విధానాల రూపకల్పనలో కీలక పాత్ర
- ఈ నియామకంతో ఇరాన్ భద్రతా విధానంలో మార్పులు తప్పవన్న విశ్లేషణలు

## మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం

- ఉత్తరాంధ్రలో రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్
- ఈ పరిశ్రమతో ఉక్కు రంగంలో అగ్రస్థానానికి ఏపీ
- ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఇది సాధ్యమైందన్న సీఎం చంద్రబాబు
- గతంలో కబ్జాలు, భయం.. నేడు అభివృద్ధి, భవిష్యత్‌పై భరోసా కల్పించామన్న సీఎం
- ఈ ప్లాంట్‌తో లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు




11లో

## కాలుష్యంలో పాకిస్థాన్ టాప్..

ప్రపంచంలోనే అత్యంత కలుషిత దేశంగా రికార్డ్

11లో



## గ్యాస్ ఆగమాగం..
## జనం బజార్లపాలు!

- అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ నిరసన.. గన్ పార్క్ వద్ద సిలిండర్లతో ఎమ్మెల్యేల ఆందోళన
- ఒక్క సిలిండర్ కోసం వారం వెయిటింగ్.. హోటళ్లు బంద్.. ఇళ్లల్లో పొయ్యిలు బంద్.
- సర్కారు దగ్గర ప్లాన్ లేదు.. సప్లైలో క్లారిటీ లేదు.. అంతా గందరగోళం!

11లో



# సంపాదకీయం

## డబ్బు కడుతున్నా డేటా మాయం

రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా ప్రస్తావించే ప్రతి అంశం సగటు భారతీయుడు ఆలోచనలకూ చాలా దెగ్గరగా ఉంటుంది. ఇప్పటి అనేక అంశాలపై రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇక తాజగా ఆయన రోజువారీ డేటా లిమిట్స్‌తో వచ్చే మొబైల్ రీచార్జ్ ప్లాన్లపై చర్చించారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా టెలికాం సంస్థలు భారీగా డేటా ఇస్తున్నాయి వంటి రోజువారీ డేటా పరిమితులను అందిస్తున్నాయి. అయితే వినియోగదారులు పూర్తిగా డేటా ఉపయోగించకపోతే, మిగిలిన డేటా అర్ధరాత్రి తర్వాత పూర్తిగా రద్దవుతోంది. ఉదాహరణకు, 2ఉః ప్లాన్ తీసుకున్న వినియోగదారు 1.5ఉః మాత్రమే వాడితే, మిగిలిన 0.5ఉః డేటా పూర్తిగా పోతుంది. దీనికి రిఫండ్ లేదా రోల్‌ఓవర్ వంటి అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

నేటి ఆధునిక యుగంలో మనిషికి గాలి, నీరు ఎంత అవసరమో, ఇంటర్నెట్ కూడా అంతే అవసరం. అయితే వినియోగదారులు డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన మొబైల్ డేటా, నిర్ణీత గడువులోగా వాడకపోతే వృథాగా పోతుంది. దీనిపై రాజ్యసభలో చర్చ జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతూ టెలికాం కంపెనీల ప్రస్తుత విధానాల్లో మార్పులు రావాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఆయన పలు కీలక సంస్కరణలను ప్రతిపాదించారు.

ప్రస్తుతం టెలికాం రంగంలో ఉన్న అతి పెద్ద లోపాన్ని రాఘవ్ చద్దా సభ దృష్టికి తీసుకొచ్చారు. వినియోగదారులు ప్రతిరోజూ నిర్దిష్ట డేటా పరిమితి కోసం ముందుగానే డబ్బులు చెల్లిస్తున్నారు. ఉదాహరణకు ఒక వినియోగదారు రోజుకు 2జీబీ డేటా ప్లాన్ తీసుకుంటే,, అందులో కేవలం 1.5 జీడీ మాత్రమే వాడితే, మిగిలిన 0.5జీ డేటా అర్థరాత్రి దాటగానే ఎక్స్‌పైర్ అయిపోతుంది. వినియోగదారుడు ఇప్పటికే ఆ జేటా కోసం డబ్బు చెల్లించాడు. అలాంటప్పుడు అది వృథా కావడం లేదా వెనక్కి తీసుకోవడం బాగా లేదు అని చద్దా స్పష్టం చేశారు. ఇది ఏదో అనుకోకుండా జరుగుతున్న పొరపాటు కాదని, టెలికాం కంపెనీలు కావాలనే అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానమని ఆయన మండిపడ్డారు. దీని వల్ల వినియోగదారులు తాము పూర్తిగా వాడుకోలేని సామర్థ్యం కోసం పదే పదే డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టెలికాం వినియోగదారుల హక్కులను కాపాడేందుకు రాఘవ చద్దా ప్రధానంగా మూడు ప్రతిపాదనలు తీసుకొచ్చారు.ప్రస్తుత పద్ధతిలో మిగిలిపోయిన డేటా మరుసటి రోజుకు కలవదు. అలా కాకుండా ఒక రోజు మిగిలిపోయన డేటాను మరుసటి రోజు కోటాకు జోడించలా అన్ని టెలికాం సంస్థలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీని వల్ల వినియోగదారులు తాము కొనుగోలు చేసిన ప్రతి డేటాను సద్వినియోగం చేసుకోనే వీలు ఉంటుంది.

కొంతమంది వినియోగదారులు నిరంతరం తమ డేటా పూర్తిగా వాడలేపోతుంటారు. అటువంటి వారి విషంలో, నెల చివరన మిగిలిపోయిన డేటాను లెక్కించి, దాని విలువను బట్టి తదుపరి నెల రీఛార్జ్ మొత్తం తగ్గింపు ఇవ్వాలని చద్దా ప్రతిపాదించారు. ఇది వినియోగదారుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని అన్నారు. డేటా బదిలీ అవకాశం: డేటాను వినియోగదారుడి డిజిటల్ ఆస్తిగా భావించాలని రాఘవ్ చద్దా ఒక వినూత్న ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. మనం బ్యాంకు నుంచి డబ్బులను ఇతరులకు పంపినట్టుగానే మన దగ్గర మిగిలిపోయిన డేటాను స్నేహితులకు, లేదా బంధువులకు బదిలీ చేసుకునే వెసులుబాటు ఉండాలని కోరారు. భారత్ డిజిటల్ ఇండియా దిశగా వేగంగా అడుగులు వేస్తున్న టైంలో డిజిటల్ సేవలు అందరికీ అందుబాటులో ఉండాలని అదే సమయంలో అవి పారదర్శకంగా ఉండాలని చద్దా పేర్కొన్నారు. మీరు ఒక వస్తువు కోసం డబ్బు చెల్లిస్తే అది మీ ఆస్తి అవుతుంది. అది వాడినా వాడకపోయినా మీకే చెందాలి. డేటా విషయంలో కూడా ఇదే సూత్రం వర్తించాలి అన్నారు. కేవలం డేటా మాయమైపోవడం వల్ల టెలికాం కంపెనీలు కోట్లాది రూపాయల లాభాలను గడిస్తున్నాయని, ఇది వినియోగదారులను వంచించడమేనని అన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని, వినియోగదారులకు అనుకూలమైన టెలికాం విధానాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభలో పేర్కొన్నారు. వాడని డేటాకు సర్దుబాటు:వినియోగదారులు నిరంతరం తక్కువ డేటా వాడితే, మిగిలిన డేటా విలువను తదుపరి రీచార్జ్‌లో తగ్గింపు రూపంలో ఇవ్వాలని సూచించారు.వాడని డేటాను కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు పంపుకునే విధానం ఉండాలని పేర్కొన్నారు. డేటాను వినియోగదారుల "డిజిటల్ ఆస్తి"గా పరిగణించాలి అన్నారు

## జ్ఞాపకంగా కృష్ణా ప్యాలెస్



లవిజయవాడ, మార్చి 24, ( కృష్ణా నదిపై బ్రిటిషర్ల హయాంలో నిర్మించిన బ్రిడ్జి చరిత్రలో జ్ఞాపకంగా మిగలబోతోంది. 130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి పిల్లర్ల కూల్చివేతలు మొదలు పెట్టారు. కొత్త డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు ఈ పాత బ్రిడ్జి పిల్లర్లను కూల్చివేయబోతున్నారు.హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో కూల్చివేతలు సాధ్యం కాకపోవడంతో.. అధికారులు లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో కూల్చేందుకు సిద్ధమవుతున్నారు.130 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన బ్రిటీష్ కాలం నాటి రైల్వే బ్రిడ్జి కనమరుగు కాబోతోంది. 1893లో ప్రారంభించిన ఈ బ్రిడ్జి స్థానంలో కొత్తగా డబుల్ లైన్ బ్రిడ్జిని నిర్మించడం కోసం రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. గతంలోనే ఈ బ్రిడ్జిపై ఉన్న నిర్మాణాన్ని కూల్చివేయగా.. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను తొలగించే పనులు చేపట్టారు. రెండు వారాలకు పైగా హైడ్రాలిక్ క్రేన్ల సహాయంతో పిల్లర్లను పగలగొట్టాలని ప్రయత్నించారు.. కానీ వీలు పడలేదు. అందుకే ఈ పిల్లర్లను కూల్చివేసేందుకు లిమిటెడ్ బ్లాస్టింగ్ పద్ధతిలో కూల్చివేతలు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో ఒక్కో పిల్లర్‌ను తొలగించకుంటూ పోతారు. దీనికి చాలా సమయం పడుతుందని చెబుతున్నారు. 1856 ప్రాంతంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎం (మద్రాస్ టు సదరన్ మరాఠా) రైల్వేలో విజయవాడ ఓ భాగంగా ఉండేది. 1893లో కృష్ణానదిపై మూడు కిలోమీటర్ల పొడవున మీటర్ గేజ్ విధానంలో ఈ రైల్వే బ్రిడ్జిని ప్రారంభించారు. వంతెన ప్రవేశ మార్గంలో కోట బురుజులను తలపించే రెండు నిర్మాణాలు ఉండటం, అవి చూసేందుకు ప్యాలెస్‌ను తలపించడంతో.. ఈ బ్రిడ్జికి కృష్ణా ప్యాలెస్‌గా పేరు పెట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి స్టీల్ వాడకుండా రాతి బండలు, గానుగ సున్నం సాయంతోనే అత్యంత పటిష్ఠంగా నిర్మించారు. అందుకే ఇన్నేళ్లు గడిచినా పిల్లర్లను కూల్చడానికి శ్రమించాల్సి వస్తోంది.

1897లో ఈ రైల్వే బ్రిడ్జిని బ్రాడ్ గేజ్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం రైల్వేశాఖ ఈ బ్రిడ్జికి తూర్పు, పశ్చిమ వైపున రైల్వే బ్రిడ్జిలు నిర్మాణం చేసింది. 1985 వరకు ఈ వంతెన సేవలు అందించింది. 1993లో అధికారికంగా ఈ వంతెనపై రాకపోకలు నిలిపేశారు. ఆ తర్వాత కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి వయాడక్ట్‌ను తొలగించగా.. అప్పటి నుంచి ఈ పిల్లర్లు మాత్రమే ఉండిపోయాయి. అయితే ప్రస్తుతం విజయవాడ, గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టడంతో.. డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని ప్లాన్ చేశారు. అందుకే ప్రస్తుతం చారిత్రక కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను కూడా తొలగించాలని నిర్ణయించారు.130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న బ్రిడ్జికి సంబంధించిన పిల్లర్లను తొలగించొద్దని కోరుతూ గతంలో కొందరు రైల్వే అధికారులకు లేఖలు రాశారు. దీంతో ఈ బ్రిడ్జి జోలికి వెళ్లలేదు.. కానీ ఇప్పుడు డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి కోసం కృష్ణా ప్యాలెస్ వంతెన పిల్లర్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఈ వంతెన పిల్లర్లను అలాగే వదిలేసి కొంత దూరంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలన్నా అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే ఈ పాత బ్రిడ్జిని తొలగించి..

కొత్త బ్రిడ్జిని నిర్మించాలని ప్లాన్ చేశారు. ముందుగా పిల్లర్లను తొలగించే ప్రక్రియను మొదలు పెట్టారు.కానీ వంతెన పిల్లర్లు ఇప్పటికీ పటిష్టంగా ఉండటంతో.. హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో వాటిని తొలగించడం సాధ్యం కాలేదు.

అందుకే లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో ఈ పిల్లర్లను కూల్చే పనులు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో తక్కువ మోతాదులో పేలుడు పదార్థాలను ఉపయోగించి, పిల్లర్లకు పగుళ్లు వచ్చేలా చేస్తారు. ఆ తర్వాత హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో తొలగిస్తారు. దీంతో విజయవాడ చరిత్రలో 'కృష్ణా ప్యాలెస్' వంతెన జ్ఞాపకంగా మిగలబోతోంది

## కాసులు కురిపిస్తున్న ఎర్ర బంగారం

గుంటూరు, మార్చి 24



తెలుగు రాష్ట్రాల్లో పండించే మిరప పంటకు ప్రపంచ స్థాయిలో గిరాకీ ఎక్కువే. నాణ్యతతోపాటు మంచి రంగు, రుచి, ఘాటు వీటికి ఉంటుంది. అయితే మిరప రైతులకు గిట్టుబాటు ధర దొరక్క యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాలు చూసేవారు. దీంతో నష్టాల బాధలు భరించలేక చాలా మంది రైతులు మిరపను సాగుచేయలేమంటూ చేతులెత్తేశారు. ఇక మరికొంతమంది రైతులు చేస్తున్న సాగు విస్తీర్ణంను తగ్గించుని కొద్ది మొత్తంలో మాత్రమే మిరప పంటను పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం మిరప పంట రైతులకు కనీవినని రీతిలో కాసులు కురిపించనున్నాయి. అందుకు కారణం మార్కెట్లో మన ఎర్రబంగారానికి ధరలు ఆశాజనకంగా ఉండటమే.ముఖ్యంగా ఏపీలో జనవరి నుంచి మిర్చి ధరల్లో క్రమ క్రమంగా పెరుగుదల కనిపించింది. క్వింటాలుకు సగటున రూ.20 వేల వరకు ధర లభిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు సగటున క్వింటాలుకు రూ.5 వేలకు పైగానే ధర పెరిగింది. మిర్చికి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు నేరుగా గ్రామాలకు చేరుకుని మధ్యవర్తుల జోక్యం లేకుండానే రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత నాలుగైదేళ్లుగా నష్టాలను చూసిన మిర్చి రైతులకు తాజా ధరలు ఉపశమనం అందించాయి. మార్కెట్లో మంచి ధర పలకడంతో ప్రస్తుతం శీతల గోదాముల్లో నిల్వ చేసిన సరకు కొద్ది కొద్దిగా తగ్గడం మొదలైంది. ఇక గుంటూరు మార్కెట్ యార్డుకు గత వారంలో 1.29 లక్షల బస్తాల మిరప రాగా.. ఇందులో ఏకంగా 1.26 లక్షల బస్తాల వరకు అమ్ముడయ్యాయి. అయితే మిర్చి సాగు ఈసారి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాదు.. కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సైతం తగ్గింది.ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగినట్లైంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్?లో డిమాండ్ అధికంగా ఉండటంతో జనవరి నెల నుంచే ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది క్వింటాల్ మిర్చీ కేవలం రూ. 10 వేలలోపు మాత్రమే పలికింది. ఈ సారి రూ.20 వేలకు పైగానే ధర పలుకుతోంది. తేజ మిర్చి ధర జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉంటే ప్రస్తుతం ఏకంగా రూ.19,500కు చేరుకుంది. తాలు రకం కూడా క్వింటాలు ధర రూ.10 వేలకు పైగానే పలుకుతుంది. ఇలా జనవరి నెల నుంచే అన్ని రకాల మిర్చీకి ధరల్లో ఘననీయమైన పెరుగుదల కనిపించింది. పంటలు 50 శాతం తగ్గడం, గోదాముల్లో మిర్చీ నిల్వలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు పోటీపడి మరీ పంటను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్?లో ధరలు ఊపందుకోవడంతో రైతులు మిర్చి పంట కోతలు కోసిన వెంటనే త్వరితగతిన ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.4 లక్షల వరకు పంట ఉత్పత్తి వ్యయం అవుతోంది. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున క్వింటాలుకు రూ.18 వేలు వేసిన పాతిక క్వింటాళ్లకు రూ. 4.50 లక్షల వరకు చేతికొచ్చే అవకాశం ఉంది.

రైతులకు ఆనందం

వరుసగా నష్టాలు రావడంతో ఇక సాగు చేయడం తమ వల్ల కాదంటూ కొందరు మిరప సాగు చేయలేదు. ఇది కాస్త కలిసి వచ్చింది. జనవరి ప్రారంభం వరకు నామమాత్రం ధరలు ఉన్నా.. కొత్త సంవత్సరం నుంచి మిరప ధరలు పైపైకి చేరాయి. ప్రస్తుతం క్వింటాల్ మిరపకు సగటున రూ.20 వేల ధర పలుకుతోంది. జనవరికి నేటికి ధరను పోలిస్తే.. సుమారు 5 వేల రూపాయల వరకు పెరిగింది. ప్రస్తుతం మిరపకు డిమాండ్ బాగా ఉండటంతో.. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్ద నుంచి మిరప కొనుగోలు చేస్తున్నారు. తాజా పరిణామంతో గత ఐదేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవి చూసిన రైతులు ఈసారి లాభాలను కళ్ల చూస్తున్నారు.

మిర్చికి ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందంటే.. గత మంగళవారం గుంటూరు మార్కెట్ యార్డుకు 1.29 లక్షల బస్తాల మిర్చి రాగా, 1.26 లక్షల బస్తాలు అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి మిర్చికి డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మిరప సాగు తగ్గిపోయింది. అటు అంతర్జాతీయ మార్కెట్ లో మిర్చికి మంచి డిమాండ్ ఉండటంతో.. ఈ సంవత్సరం జనవరి నుంచి మిర్చి ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది ఇదే సమయానికి రూ.10 వేలకు అమ్ముడుపోయిన మిర్చికి ఇప్పుడు రూ.20 వేల ధర పలుకుతోంది.సన్న రకాలకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉన్న తేజ మిర్చి క్వింటాల్ ధర ప్రస్తుతం రూ.19,500కు చేరింది. తాలు ధరలు క్వింటాలుకు రూ.10 వేలకు పైనే ఉన్నాయి. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిరప కోసిన వెంటనే ఆరబెట్టి అమ్మేస్తున్నారు.ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మిరప సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్ని ఖర్చులూ కలిపి ఎకరాకు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారు అన్నదాతలు. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. సగటున క్వింటాలుకు రూ.18 వేల ధర లభిస్తే.. అప్పుడు రూ.4.50 లక్షల వరకు చేతికొస్తోందని తెలిపారు.

## కొండెక్కిన కోడి

నెల్లూరు, మార్చి 24

మాంసం ప్రియులకు షాకింగ్ న్యూస్. ఎందుకంటే చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తు?న్న చికెన్ ధరలు.. తాజాగా భారీ స్థాయిలో ఎగబాకుతోంది. ధరలు కొండెక్కుతున్నాయి. ఆదివారం బహిరంగ మార్కెట్‌లో కిలో చికెన్ (స్కిన్‌లెస్) ధర రూ.340 వరకు ఉండగా, అదే వారం రోజుల కిందట కిలో చికెన్ ధర రూ.260 వరకు ఉంది. చికెన్ ధరలు ఒక్కసారి పెరగడంతో సామాన్యులు కష్టంగా మారిపోయింది. ముందే యుద్ధం కారణంగా ఒక్కొక్కటిగా ధరలు పెరిగిపోతుండటంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు చికెన్ ధరలు పెరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది.



ఇదిలా ఉంటే మరోవైపు కోడి గుడ్డు ధర మాత్రం పడిపోతున్నాయి. గతంలో ఒక గుడ్డు ధర రూ.8 వరకు ఉండగా.. ఇప్పుడు రూ.4..20 పైసల వద్ద కొనసగుతోంది. కోడిగుడ్లు ఎగుమతి ఆగిపోవడంతో ధరలు పడిపోయాయని పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. అయితే వాస్తవానికి కోడిగుడ్లు తమిళనాడుకు తీసుకెళ్లి అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతాయి. కానీ ప్రస్తుతం యుద్ధం కారణంగా గల్ఫ్‌కు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో గుడ్డు ధర ఆమాంతంగా పడిపోయింది.చికెన్ ధర పెరగడానికి బ్రాయిలర్ కోళ్ల ఉత్పాదకత తగ్గడం, రంజాన్, ఇతర ఫంక్షన్ల కారణంగా చికెన్ ధరలు పెరగడానికి కారణమని చెబుతున్నారు చికెన్ దుకాణ వ్యాపారులు. డిమాండ్‌కు సరిపడా చిన్న బ్రాయిలర్ కోళు కూడా దొరకడం లేదట. అలాగే పౌల్ట్రీ నిర్వాహకులు పిల్లల పెంపకం ఆపేడయం కూడా మరో కారణం అంటున్నారు. కోళ్ల డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేని కారణంగా చికెన్ ధరలు భారీగా పెరుగుతున్నాయని చెబుతున్నారు.

## మళ్లీ రంగంలోకి ప్రశాంత్ కిషోర్



గుంటూరు, మార్చి 24( 2019 ఎన్నికల్లో వైసీపీ సాధించిన ప్రభంజన విజయంలో ప్రశాంత్ కిశోర్ వ్యూహాలు ఎలా సక్సెస్ అయ్యాయో రాష్ట్రంలో అందరికీ తెలిసిందే. అయితే 'రావాలి జగన్ – కావాలి జగన్' నినాదం అప్పట్లో ఏపీని ఊపేసింది. ఊరూరా వైసీపీ జెండా రెపరెపలాడింది. అయితే 2024 ఎన్నికల సమయంలో మాత్రం వైసీపీ చతికిలపడింది. ఇందుకు పీకే దూరమవ్వడమే కారణం. కేవలం ఐప్యాక్ (ఎ–ఖంఅ) టీమ్‌తోనే జగన్ ఎన్నికలకు వెళ్లడంతో అత్యంత దారుణమైన పరాభవాన్ని మూటగట్టుకున్నారు. జగన్ 175 అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ఘోర పరాజయాన్ని చవిచూశారు. అయితే ఇప్పుడు పార్టీని మళ్ళీ గాడిలో పెట్టేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారు. తన పాత మిత్రుడు పీకే వైపు చూస్తున్నట్లు పొలిటికల్స్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది.కాగా 2024 ఎన్నికల ఫలితాలకు ముందు ప్రశాంత్ కిషోర్ చేసిన కొన్ని వ్యాఖ్యలు అప్పట్లో ఏపీ రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని రేపాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి తప్పదని కుండబద్దలు కొట్టారు. అంతేకాదు ఆ అంచనాలే నిజం అయ్యాయి. దీంతో వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలతో జగన్ ప్రజల్లోకి వెళ్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడంలేదని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీకే వంటి బలమైన వ్యూహకర్త మళ్లీ అవసరమని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు 2029 లక్ష్యాన్ని ఛేదించేందుకు మూడేళ్ల ముందే నుంచి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారని, ఇందులో భాగంగానే పీకేతో జగన్ సంప్రదింపులు చేస్తున్నారనే ప్రచారం రాష్ట్రంలో జోరుగా జరుగుతోంది.ప్రస్తుతం ప్రశాంత్ కిశోర్ బీహార్‌లో జన్ సూరాజ్ పార్టీ పెట్టి ఆ ప్రయాణంలో బిజీగా ఉన్నారు. గతంలో ఆయన 'నేను వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నాను' అని ప్రకటించారు. కానీ జగన్‌తో ఉన్న పాత పరిచయం కారణంగా వీరి కలయిక మళ్లీ సాధ్యమేననే విశ్లేషణలు జరుగుతున్నాయి. ఐప్యాక్ టీమ్ క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేస్తే మళ్లీ విజయవంతమైన ఫలితాలు ఉంటాయని, అటు క్యాడర్‌లోనూ కొత్త ఉత్సాహం వస్తుందని వైసీపీ అగ్రనేతలు భావిస్తున్నారని తెలుస్తోంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనే సామెత ఉండనే ఉంది. ఈ ప్రకారం జగన్, పీకే మళ్ళీ చేతులు కలిపితే రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు జరుగుతాయి.

# రాజ్యసభకు యనమల, సానా



కాకినాడ, మార్చి 24(కూటమిలో రాజ్యసభ రేసు ఆసక్తికరంగా మారింది. త్వరలో ఏపీలో నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ కాబోతున్నాయి. దీంతో పెద్దల సభ రేసులో..తెలుగు తమ్ముళ్లు పెద్ద క్యూ కట్టారు. పైరవీల పర్వం నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంది. నాలుగు స్థానాల సీట్లలో టీడీపీకి రెండు, జనసేన, బీజేపీకి చెరో సీటు దక్కే అవకాశం ఉంది. టీడీపీకి దక్కే రెండింటిలో గతేడాది ఎన్నికైన సానా సతీష్ ఏడాదిన్నరలోనే పదవీ విరమణ చేస్తుండటంతో ఆయనకు మళ్లీ రెన్యూవల్ చేస్తారని పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీకి కొత్తగా దక్కేది ఒక్క సీటేనన్న అంచనాలు ఉన్నాయి.ఆ ఒక్క సీటు కోసం టీడీ జనార్ధన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయన సీఎం చంద్రబాబు రాజకీయ కార్యదర్శిగా ఉన్నారు. టీడీపీ మాజీ పొలిట్ బ్యూరో మెంబర్, గతంలో ఎమ్మెల్సీ. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో టీడీ జనార్ధన్‌ను రాజ్యసభకు పంపితే..ఢిల్లీ పనులన్నీ చక్కబెడతారని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే టైమ్‌లో మరో సీనియర్ లీడర్ యనమల రామకృష్ణుడు రాజ్యసభ బెర్త్ కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.తెలుగుదేశం పార్టీ పుట్టిన దగ్గర నుంచి యనమల రామక్రిష్ణుడు పార్టీలో ఉన్నారు. 1983లోనే ఆయన ఎమ్మెల్యేగా గెలిచి..ఎన్టీఆర్ మంత్రి వర్గంలోనే కీలక మంత్రి పదవులు నిర్వహించారు. ఇక చంద్రబాబు హయాంలో స్పీకర్‌గానే కాకుండా ఆర్థిక మంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేస్తూ ఎన్నో బడ్జెట్లను ప్రవేశపెట్టారు. పన్నెండేళ్ల పాటు ఎమ్మెల్సీగా ఉన్నారు. అయితే యనమల చిరకాల కోరిక రాజ్యసభకు వెళ్లాలని. దశాబ్ద కాలంగా ఆయన పెద్దల సభకు వెళ్లాలని ఆశపడుతున్నారు. కానీ ఇప్పటివరకు అవకాశం లేదు.ఇప్పుడా ఆ ముహూర్తం దగ్గర పడిందా అంటే అవుననే ప్రచారం జరుగుతోంది. అయితే సానా సతీష్‌కు రెన్యూవల్ చేయగా..మిగిలిన సీటును సీనియర్లలో ఎవరికో ఒకరికి ఇవ్వాలని చంద్రబాబు ఫిక్స్ అయినట్లు టాక్. పైగా ఆ సీటు బీసీలకు ఇస్తారని అంటున్నారు. ఈ రెండు ఈక్వేషన్స్ బట్టి చూస్తే యనమల స్వీట్ న్యూస్ పక్కా అన్న మాట బలంగా వినిపిస్తోంది. గతేడాది మార్చిలోనే ఆయన ఎమ్మెల్సీ పదవి గడువు ముగిసింది. దీంతో పెద్దాయనకు సముచితమైన గౌరవం దక్కాలంటే కచ్చితంగా రాజ్యసభకు పంపడమే బెటర్ అని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.యనమల చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. ఆంతరంగికుడిగా మెలుగుతారు కూడా. ఇద్దరూ సమ వయస్కులు. ఇద్దరూ రాజకీయంగా కలసి మెలసి ఉంటూ టీడీపీలో కీలక దశకు చేరుకున్న వారు. దాంతో చంద్రబాబు తన మిత్రులకు..పైగా సీనియర్లకు గౌరవనీయమైన స్థానం కల్పించే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. గతేడాది సీనియర్ లీడర్ అశోక్ గజపతి రాజుకు గోవా గవర్నర్‌గా అవకాశం దక్కింది. ఇప్పుడు మరో సీనియర్ నేత యనమల వంతు వచ్చిందని..ఆయనకు రాజ్యసభ సీటు రిజర్వ్ అయిందని చెబుతున్నారు. త్వరలోనే చంద్రబాబు నోట యనమలకు గుడ్ న్యూస్‌ను వినిపించబోతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.అయితే ఈ మధ్యే యనమల అల్లుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడం పెద్ద రచ్చగా మారింది. ఆ ఎఫెక్ట్‌తో యనమల అవకాశాలు ఏమైనా పోతాయా అనే ప్రచారం నడుస్తుండగా..అలాంటిదేమీ లేదని అంటున్నారు. యనమల టీడీపీ పుట్టినప్పటి నుంచి



నిబద్ధతతో పార్టీకి సేవ చేస్తున్న లీడర్. ఆయన అనుభవం, పార్టీకి చేసిన సేవ లెక్కలోకి వస్తాయని చెబుతున్నారు. మొత్తానికి యనమల పెద్దల సభలోకి అడుగు పెట్టాలన్న కోరిక మరో రెండు నెలలలో తీరిపోతుందని అంటున్నారు. లాస్ట్ మినిట్ ఏమైనా మార్పులు చేర్పులు జరుగుతాయా? లేక యనమలకు బెర్త్ పక్కానా అనేవి చూడాలి.

## డ్యామేజ్ కంట్రోల్ కోసం
# వైసీపీ రూట్ మార్చిందా?

విశాఖపట్టణం, మార్చి 24

ఏపీ పాలిటిక్స్‌లో గాజువాకకు స్పెషల్ పొలిటికల్ బ్యాగ్రౌండ్ ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లాగా..ఇక్కడ క్యాస్ట్ పాలిటిక్స్ చేయడం అంత ఈజీ కాదన్న అభిప్రాయం ఉంది. అయితే గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగానే కాదు..గాజువాకలోనూ వైసీపీ వేసిన వ్యూహాలు ఏ మాత్రం వర్కౌట్ కాలేదు. ఘోర పరాజయం తప్పలేదు. దీంతో ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికలకు ముందు వైసీపీ పెద్దలు కాస్త అలర్ట్ అయినట్లు కనిపిస్తోంది. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని వైసీపీ స్టేట్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సభ్యుడిగా నియమించింది. వైసీపీకి పీఏసీ అనేది చాలా ప్రెస్టీజియస్. సీనియర్ లీడర్లు, మాజీ మంత్రులు, కీలక నేతలకు మాత్రమే చోటు దక్కుతుంది.కానీ గాజువాకలో కేవలం ఒకే ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన తిప్పల నాగిరెడ్డిని పీఏసీలోకి తీసుకోవడం వెనుక వైసీపీ స్ట్రాటజీ ఏంటన్నది విశాఖ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. నాగిరెడ్డి కేవలం ఒకే ఒక్కసారి గెలిచినా సరే సంచలన విజయాన్ని రికార్డు క్రియేట్ చేశారు. 2019లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను 16వేల ఓట్లతో ఓడించి తన పేరు రీసౌండ్ చేసేలా గుర్తింపు పొందారు. అయితే మాత్రం ఏం లాభం..గత ఎన్నికల్లో వైసీపీ అనూహ్యంగా ఆయన్ను పక్కన పెట్టింది. వృద్ధాప్యం..అనారోగ్యం..కారణంగా తన కుమారుల్లో ఎవరో ఒకరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ నాగిరెడ్డి హైకమాండ్‌కు ఛాయిస్ ఇచ్చి సైలెంట్ అయిపోయారు.పవన్‌ను ఓడించిన నేతగా నాగిరెడ్డికి క్రెడిట్ ఉన్నా తన కుమారులకు టికెట్ ఇవ్వాలంటూ ఆయన చేసిన రిక్వెస్ట్‌ను వైసీపీ అధిష్టానం లైట్ తీసుకుంది. క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో యాదవ సామాజికవర్గానికి చెందిన నేతను బరిలో నిలిపితే విజయం వరిస్తుందని అంచనా వేసి ఉరుకూటి చందు అనే నేతకు నియోజకవర్గ బాధ్యతలు కూడా అప్పగించారు. వైసీపీ తీసుకున్న ఈ నిర్ణయం గాజువాకలో గందరగోళం సృష్టించినా సరే పార్టీ పెద్దలు వెనక్కి తగ్గలేదు. యాదవ సామాజికవర్గానికి చెందిన ఉరుకూటి చందుకే టికెట్ అనే సంకేతాలను బలంగా పంపారు. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో..కాపు సామాజికవర్గానికి చెందిన గుడివాడ అమర్‌నాథ్‌ను లాస్ట్ మినిట్‌లో గాజువాక బరిలోకి దించారు. కూటమి తరుపున యాదవ సామాజికవర్గ నేత పల్లా శ్రీనివాసరావు బరిలోకి దిగడంతో..కాపు ఈక్వేషన్స్..స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంటూ వైసీపీ వేసిన స్కెచ్‌లన్నీ గాల్లో కొట్టుకుపోయాయి. రాష్ట్రంలోని 175 ఎమ్మెల్యేల్లో..గాజువాకలోనే టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చింది.ఘోర ఓటమి తర్వాత ఇప్పుడు వైసీపీ పెద్దలకు అసలు సీన్ అర్థమైందన్న టాక్ వినిపిస్తోంది. త్వరలో స్థానిక, విశాఖ కార్పొరేషన్ ఎన్నికలు రానుండటంతో పట్టు నిలుపుకోవాలన్న ఉద్దేశంతో కీలక నిర్ణయాలు తీసుకుంటుందట. ఇందులో భాగంగా తిప్పల నాగిరెడ్డిని మళ్లీ తెరపైకి తెచ్చారని అంటున్నారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్నానని, వయోభారంతో రాజకీయాల్లో కొనసాగలేనని రెండేళ్ల క్రితమే చేతులెత్తేసిన తిప్పల నాగిరెడ్డిని మళ్లీ పొలిటికల్ స్క్రీన్ తెస్తూ..పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మెంబర్‌గా నియమించింది

. ఈ నిర్ణయం వెనుక వైసీపీ పెద్ద కసరత్తే చేసిందన్న టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం వైసీపీకి గాజువాకలో దిక్కూమొక్కూ లేదు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన గుడివాడ అమర్‌నాథ్ చోడవరం నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దీంతో వైసీపీకి నియోజకవర్గాన్ని నడిపే నాయకుడు కరువయ్యాడు. గ్రేటర్ విశాఖ సిటీలోనే ఇలాంటి దుస్థితి ఉంటే కష్టమని భావించి నాగిరెడ్డికి హితబోధ చేసి మరీ ఈ బాధ్యతలు అప్పగించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్ సంగతి తర్వాత ముందు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని నాగిరెడ్డికి టాస్క్ ఇచ్చారట. చెరోదారిలో వెళ్లిపోయిన తన కుమారులను కూడా దారికి తెచ్చుకుని పార్టీకో దారి చూపిస్తారనే ఆశలతోనే వైసీపీ నాగిరెడ్డికి పీఏసీ చాన్స్ ఇచ్చారని అంటున్నారు. కూటమి నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని నాగిరెడ్డి గాజువాకలో వైసీపీకి పూర్వవైభవం తీసుకొస్తారో లేదో చూడాలి.

## అందుబాటులోకి
# రానున్న నేషనల్ హైవే 565

ఒంగోలు, మార్చి 24

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కీలకమైన నేషనల్ హైవే 565 పనులు పూర్తి చేశారు. ఈ హైవేపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ హైవే పనుల్లో భాగంగా.. యర్రగొండపాలెం దగ్గర 20 కిలో మీటర్ల రోడ్డును విస్తరించారు. దీంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఊరట దక్కింది. ఈ 20 కిలో మీటర్లు అటవీ ప్రాంతం మీదుగా వెళుతోంది.. బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లతో ప్రయాణం సాఫీగా సాగుతోంది.తెలుగు రాష్ట్రాల మధ్య నేషనల్ హైవే 565 అందుబాటులోకి వచ్చింది. తెలంగాణలోని నకిరేకల్ వద్ద మొదలయ్యే ఈ హైవే.. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి సమీపంలో ఉన్న ఏర్పేడు దగ్గర ముగుస్తుంది. ఈ కొత్త హైవే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 65ని.. మదనపల్లె నుంచి నాయుడుపేట వెళ్లే నేషనల్ హైవే 71తో కలుపుతుంది. తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి తిరుపతి వెళ్లడానికి ఈ కొత్త హైవే ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడనుంది.ఈ హైవే నల్గొండ, మాచర్ల, యర్రగొండపాలెం, మార్కాపురం, పొదిలి, కనిగిరి, పామూరు, దుత్తలూరు, రాపూరు, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా వెళుతోంది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్ రాత్రిళ్లు అటవీ ప్రాంతం మీదుగా వెళ్లడం గతంలో చాలా ఇబ్బందిగా ఉండేది. ముఖ్యంగా పుల్లల చెరువు దగ్గర నుంచి వెల్దుర్తి మండలం వరకు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండేది. ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అయితే జాతీయ రహదారి 565 నిర్మాణంతో ఆ కష్టాలు తొలగిపోయాయి. ఈ రోడ్డు అభివృద్ధి చేయడంతో యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం సులభతరమైంది.

ఈ రూట్‌లో.. ఎన్‌హెచ్-565లో భాగంగా ఉన్న ఈ 20 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు గతంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా అటవీ అనుమతులు ఆలస్యం కావడంతోపాటు మరికొన్ని అడ్డంకులు వచ్చాయి. అయితే




2024లో ఈ పనులకు లైన్ క్లియర్ కావడంతో.. గతేడాది పనులు ప్రారంభించి వేగవంతం చేశారు. ఈ రోడ్డును నిర్దేశిత సమయం కంటే ముందే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. అటవీ ప్రాంతం మీదుగా కొండలు, లోయల మధ్య వెళ్లే ప్రయాణికులకు ఈ మార్గం సరికొత్త అనుభూతిని పంచుతోంది. రోడ్డు బాగోలేకపోవడంతో పుల్లలచెరువు నుంచి వెల్దుర్తి మండలం వరకు ప్రయాణానికి 50 నిమిషాలు పట్టేది. కానీ ఇప్పుడు 20 నిమిషాల్లోనే వెళ్లొచ్చు. 20 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు నిర్మాణానికి రూ.393 కోట్లు ఖర్చు చేశారు. అటవీ ప్రాంతం, ఘాట్ రోడ్డు కావంతో చిన్న, పెద్దవి కలిపి మొత్తం 16 వంతెనలు, 8 అండర్‌పాస్‌లను ఏర్పాటు చేశారు. మార్కాపురం జిల్లాతో కడప జిల్లాలోని పోరుమామిళ్ల ప్రాంతం నుంచి ఈ రోడ్డు మీదుగానే హైదరాబాద్ వెళ్లొచ్చు. ఈ హైవే మొత్తం పొడవు దాదాపు 420 కిలోమీటర్లు కాగా.. మెజార్టీ భాగం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. తెలంగాణలోని నకిరేకల్, నల్గొండ, కనగల్, దేవరకొండ ప్రాంతాలను దాటిన తర్వాత మాచర్ల వద్ద ఈ హైవే ఏపీలోకి ఎంటర్ అవుతుంది. ఏర్పేడు వద్ద ఎడమ వైపు ప్రయాణిస్తే శ్రీకాళహస్తి, కుడి వైపు తిరిగే తిరుపతి వెళ్లొచ్చు.

# రాహుల్ గాంధీ వర్సెస్ నరేంద్రమోడీ

న్యూఢిల్లీ, మార్చి 24,

ఆ రాహుల్ గాంధీ సమయం దొరికితే చాలు నరేంద్ర మోడీ మీద మండిపడుతుంటాడు. రాజకీయానికి.. జాతీయభావానికి తేడా ఏమిటో రాహుల్ గాంధీకి ఇంకా తెలియదు. రాహుల్ గాంధీకి చెప్పేవారు లేరా.. చెబితే వినిపించుకోడా.. ఏంటో కాంగ్రెస్ పార్టీకి దురవస్థ. రాహుల్ గాంధీ లో లోపాలే నరేంద్ర మోడీకి వరాలుగా మారుతున్నట్టున్నాయి. అందువల్లే ఏక ఛత్రాధిపత్యంగా నరేంద్ర మోడీ దేశాన్ని పాలిస్తున్నారు .మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో.. భారత్ పై ఏదో ఒక రూపంలో ఆ ప్రభావం పడుతుందని అందరూ అనుకున్నారు. అనుకున్నట్టుగానే చమురు.. గ్యాస్ విషయంలో భారత్ మీద ఆ ఎఫెక్ట్ పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద కన్స్యూమర్ మార్కెట్ గా భారత్ ఉంది. చమురు, గ్యాస్ వంటివి సరఫరా కాకపోతే దేశంలో పరిస్థితి దారుణంగా మారుతుంది. అందువల్లే నరేంద్ర మోడీ ఇక్కడ తన చాకచక్యాన్ని ప్రదర్శించారు. ఎంతో చతురతతో ప్రపంచ దేశాలను ఒప్పించారు. ఇరాన్ గ్యాస్ సరఫరా చేయడానికి ఒప్పుకుంది. అమెరికా కూడా ఎటువంటి ఆంక్షలు లేకుండా భారత్ కు ద్వారాలు తెరిచింది. ఒక నాయకుడు బలంగా ఉంటే.. ఏ దేశమైనా సరే సలాం చేస్తుంది. అందుకు మోడీ



నాయకత్వం బలమైన ఉదాహరణ.భారత్ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యాలలో ఒకటిగా ఉంది. భారత్ వద్ద ఉన్న సైనిక బలాన్ని పరిగణలోకి తీసుకుంటే ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద సైన్యం ఉన్న దేశంగా భారత్ ఉంది. ఆసియాలో చైనా, రష్యా తర్వాత సైనిక సామర్థ్యంపరంగా భారత్ మూడో స్థానంలో ఉంది. భారత్ ఎప్పుడూ కూడా ఇతర దేశాల మీద దాడి చేయలేదు. ప్రతి సందర్భంలోనూ స్నేహపూర్వకమైన వాతావరణాన్ని మాత్రమే కోరుకున్నది. అంతటి పాకిస్తాన్ ఉగ్రవాదులతో జతకట్టి.. ఘోరాలకు పాల్పడితే.. భారత్ ప్రతి సందర్భంలోనూ గట్టి బదులిచ్చింది. పాకిస్తాన్ మినహా.. ఏ దేశం మీద కూడా భారత్ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దాడి చేయలేదు.ఇక ఇజ్రాయిల్ దేశంతో భారతదేశానికి బలమైన సంబంధాలు ఉన్నాయి. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఈ సంబంధాలు మరింతగా బలపడ్డాయి. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి భారత నాయకత్వం మీద తన ఆత్మీయతను.. అనుబంధాన్ని బహిరంగంగానే వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీని తనకు ఇష్టమైన స్నేహితుడిగా అభివర్ణించారు. కేవలం ఇజ్రాయిల్ తో మాత్రమే కాకుండా భారత్ ఇరాన్ తో కూడా బలమైన సంబంధాలను కొనసాగిస్తుంది. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.. భారత్ ఉభయ కుశలోపరి విధానాన్ని కొనసాగించింది. అందువల్లే ఇరాన్ ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండానే మనకు గ్యాస్.. క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తోంది.వాస్తవానికి మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తలు కొనసాగుతున్నప్పటికీ.. రాహుల్ గాంధీ నాయకులు సరెండర్ మోడీ అని విమర్శలు చేసినప్పటికీ.. నరేంద్ర మోడీ తన స్థిరత్వాన్ని కోల్పోలేదు. ఇక్కడ రాజకీయాల కంటే దేశ సామరస్యం.. అభివృద్ధి కోసమే ఆయన కట్టుబడి ఉన్నారు. అందువల్లే ట్రంప్ ఆదేశించినప్పటికీ హర్ముజ్ జల సంధిలో భారత్ నౌకలను మోహరించలేదు. అపరమైన నావికాదళ బలమున్నప్పటికీ ట్రంప్ చెప్పినట్టు నరేంద్ర మోడీ చేయలేదు.. ఒక ప్రాంతీయ సంఘర్షణలో ప్రత్యక్ష పాత్ర పోషించడానికి సుముఖత లేదని నరేంద్ర మోడీ తన విధానాల ద్వారా స్పష్టం చేశారు.కొంతమంది నరేంద్ర మోడీ నాయకత్వాన్ని.. భారత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.. కానీ అలాంటివారు తెలుసుకోవాల్సింది ఏంటంటే.. ప్రపంచంలో అస్థిరత ఉంది. అశాంతి కనిపిస్తోంది. ఇంకా అనేక రకాలైన సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. అయితే అంతటి కల్లోల ప్రపంచంలో భారత్ ప్రశాంతంగా ఉంది. సురక్షితంగా ఉంది. శాంతియుతంగా ఉంది. ఇలా ఉంటుందని ఎవరైనా ఊహించగలరా.. మిడిల్ ఈస్ట్ దేశాల ప్రజల ఫోన్లకు అక్కడి ప్రభుత్వాల నుంచి మిస్సైల్స్ దాడులు.. డ్రోన్ దాడుల గురించి హెచ్చరికలు వస్తున్నాయి. కానీ భారత్ లో ప్రజలు మాత్రం సినిమాలు.. యూట్యూబ్.. ఇన్స్టాగ్రామ్ రీల్స్ చూస్తూ ఆనందంగా ఉంటున్నారు. దీనిని బట్టి మోడీ నాయకత్వ పటిమ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# అందుబాటులోకి జెన్ జీ కీ బోర్డు

హైదరాబాద్, మార్చి 24,
స్తుత కాలంగా డిజిటల్ యుగంగా మారిపోయింది. ఇంటర్నెట్ జీవితాన్ని, పనిని అత్యంత సులభతరం చేసింది. ఇంటి నుండే దూరపు బంధువులతో సంప్రదించడం, మాట్లాడటం సులభమైంది. సాంకేతికత కారణంగా, గంటల సమయం పట్టే పనులు ఇప్పుడు నిమిషాల్లో పూర్తవుతున్నాయి. మొత్తమ్మీద, ప్రస్తుత కాలం డిజిటల్ కమ్యూనికేషన్ యుగం, కానీ సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి సంఘటనలు ఈ డిజిటల్ కమ్యూనికేషన్‌కు అతిపెద్ద సవాలుగా మారాయి. దీనికి ప్రధాన కారణం అసురక్షిత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు అంటే అప్లికేషన్‌లను ఉపయోగించడం. విదేశాల నుండి పనిచేసే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సురక్షితం కాకపోవడమే పెద్ద సమస్య. అంటే, విదేశీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించడం ద్వారా భారతదేశంలోని సామాన్య ప్రజలు సురక్షితంగా లేరని తాజా నివేదికలు చెబుతున్నాయి. అందువల్ల, ఇది జాతీయ భద్రతకు కూడా ముప్పుగా పరిగణించిందిఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, అనువాదిని ఏఐ సురక్షితమైన, నమ్మకమైన, పూర్తిగా స్వదేశీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వచ్చింది. హైప్డ్ సంవాదిని, దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ యాప్‌ను అభివృద్ధి చేసింది. వీటిని లాంఛనంగా ప్రారంభించారు., దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ యాప్‌ప్రస్తుతం 80 కోట్లకు పైగా భారత పౌరులు విదేశీయులు నిర్వహిస్తున్న డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్‌లపై ఆధారపడి ఉన్నారు. డేటా భద్రత, గోప్యత, భాషా సమ్మిళితత్వం వంటి సమస్యలు కీలకమయ్యాయి. సురక్షితమైన, స్వదేశీ, గోప్యతపై దృష్టి సారించిన ప్రత్యామ్నాయాల అవసరం గతంలో కంటే ఇప్పుడు మరింత ముఖ్యమైనదిగా మారిపోయాయి.

అధిక ప్రచారం పొందుతున్న సంవాదిని గురించి, అనువాదిని ఏఐ సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇది భారతదేశపు మొట్టమొదటి సిమ్-ఆధారిత, బహుభాషా, స్పామ్-రహిత గ్లోబల్ మెసెంజర్ అని అన్నారు. ఈ ప్లాట్‌ఫామ్, డైనమిక్ చాట్ ఐడీల ద్వారా వినియోగదారులు తమ మొబైల్ నంబర్లను పంచుకోకుండానే వ్యక్తిగత చాట్‌లు, గ్రూప్ చాట్‌లు, ఆడియో కాల్‌లు, వీడియో కాల్‌ల ద్వారా సురక్షితంగా సంభాషించుకోవడానికి వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, డివైస్-బైండింగ్, అధునాతన యాంటీ-స్పామ్ యంత్రాంగాలు దీనిని సైబర్ నేరాలు, మోసాలు, నకిలీ ఖాతాల నుండి సురక్షితంగా ఉంచుతాయని చంద్రశేఖర్ వెల్లడించారు.అనువాదిని ఏఐ అత్యంత ముఖ్యమైన ఫీచర్ గురించి మాట్లాడుతూ, 22 భారతీయ, 37 విదేశీ భాషలలో రియల్-టైమ్ టెక్స్ట్, వాయిస్ అనువాదాన్ని అందిస్తూ, దేశ భాషా వైవిధ్యాన్ని ఒక శక్తివంతమైన డిజిటల్ వారధిగా మారుస్తుందని సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ వివరించారు. ఇది 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తుందన్నారు. భద్రత కోసం హైప్డ్ సంవాదినిలో వన్-ట్యాప్ ూూ అత్యవసర ఫీచర్ కూడా ఉందని, ఇది లైవ్ లొకేషన్‌తో తక్షణ సహాయాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. ఇది ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.హైప్డ్ సంవాదిని ప్రాంతీయ భాషలలో స్థానిక ఉపాధి, ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్, గిగ్ అవకాశాలను అందిస్తూ, యువతకు వారి సొంత వాతావరణంలోనే అవకాశాలను కల్పిస్తుందని చంద్రశేఖర్ వివరించారు. భాషా అభ్యాస మాడ్యూళ్లు, సామాజిక భాగస్వామ్యం, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ గేమ్‌ల వంటి ఫీచర్లు దీనిని కేవలం సమాచార మార్పిడికి మాధ్యమంగానే కాకుండా, భాగస్వామ్యం, అభివృద్ధికి కూడా ఉపయోగపడే ఒక సమగ్ర డిజిటల్ పర్యావరణ వ్యవస్థగా మారుస్తాయని తెలిపారు.దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ గురించి అనువాదిని ఏఐ సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ మాట్లాడుతూ, "ఇది ఒక అధునాతన ఏఐ-ఆధారిత టైపింగ్, ఎక్స్‌ప్రెషన్ ప్లాట్‌ఫామ్. ఇది 22 భారతీయ, 70కి పైగా విదేశీ భాషలలో టైపింగ్, వాయిస్-టు-టెక్స్ట్, తక్షణ అనువాదాన్ని అందిస్తుంది. ఈ కీబోర్డ్ వినియోగదారులకు వారి మాతృభాషలో నిరాటంకమైన, వేగవంతమైన, సమర్థవంతమైన కమ్యూనికేషన్ అనుభవాన్ని అందిస్తుంది."

అని తెలిపారు.దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్, జెన్‌జెడ్-శైలి స్లాంగ్ షార్ట్‌కట్‌ల వంటి అధునాతన ఫీచర్లను అందిస్తుంది. అధునాతన టైపింగ్ నియంత్రణలు, బహుళ లేఅవుట్‌లకు మద్దతు ఇస్తుంది. యాక్సెంట్‌లు, చిహ్నాలు, కరెన్సీలు దీనిని అత్యంత ఉపయోగకరంగా చేస్తాయి.

అంతర్నిర్మిత క్లిప్‌బోర్డ్ మేనేజర్, ఉఎఈలు, స్టిక్కర్లు, కస్టమ్ ంఎ స్టిక్కర్ల వంటి ఫీచర్లు వినియోగదారు అనుభవాన్ని మరింత ఆకర్షణీయంగా, భావవ్యక్తీకరణకు సహాయపడుతుంది. దీని ఫ్లోటింగ్, పరిమాణాన్ని మార్చుకోగల, పూర్తిగా అనుకూలీకరించదగిన ఇంటర్‌ఫేస్ దీనిని వేగవంతంగా, సరళంగా, యూజర్-ఫ్రెండ్లీగా చేస్తుంది.

## తెలంగాణ కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రులు ఔట్.. మంత్రివర్గంలోకి కొత్త నేతలు.. హైకమాండ్ బిగ్ ప్లాన్!


హైదరాబాద్, మార్చి 24, తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో ఒకరిద్దరికి కేబినెట్ నుంచి ఉద్వాసన పలకనున్నారు. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. అయితే సామాజిక వర్గ సమీకరణాలను పరిగణలోకి తీసుకుని.. ఎవరిని తొలగిస్తున్నారో వారిని అదే సామాజిక వర్గ నేతతో భర్తీ చేయనున్నారు.తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో మార్పులు జరగనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన విషయంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కేబినెట్‌లో కొనసాగుతున్న మంత్రుల్లో ఒకరు, లేదా ఇద్దరిని తప్పించి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ప్రమోషన్లు ఇచ్చి పార్టీలో ఉన్నత పదవులు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఏ సామాజిక వర్గ మంత్రిని తొలగిస్తున్నారో.. కొత్తగా అవకాశం కల్పించే వారిని కూడా అదే సామాజిక వర్గం నుంచి తీసుకురావాలని తెలుస్తోంది.ఇక మంత్రివర్గం నుంచి తీసేసిన వారిని వారి సీనియారిటీని ఆధారంగా చేసుకుని.. సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి ఆయా మంత్రులకు ఇప్పటికే పార్టీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అందుకు ఆ నేతలు కూడా సానుకూలంగానే అంగీకరించినట్లు హస్తం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రులను తప్పించడంతోపాటు.. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మరో 2 మంత్రి పదవులను కూడా భర్తీ చేసేందుకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.అయితే మంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు చేసేందుకు ఆయా జిల్లాల ప్రాతినిథ్యం, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావిస్తోంది. కేబినెట్ విస్తరణపై పార్టీలో అంతర్గత వివాదాలు రాకుండా ఉండేందుకు పక్కాగా ప్రణాళికలు చేస్తోంది. తప్పించిన మంత్రుల స్థానాలను అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతోనే భర్తీ చేయాలనే నిర్ణయించినట్లు సమాచారంఇక మంత్రి పదవుల నుంచి తప్పించిన వారు.. అవమానంగా భావించకుండా ఉండేందుకు.. వారికి ఉన్నత పదవులు ఇచ్చి హైకమాండ్ భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. అలాంటి వారికి పార్టీలో కీలకమైన, గౌరవప్రదమైన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది.

ఇందులో భాగంగానే బీసీల్లో సంఖ్యాబలం ఎక్కువ ఉన్న మున్నూరు కాపులు, ఎస్టీల్లో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ నేతల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈసారి శాసనమండలి నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు సమాచారం.కేబినెట్‌లో మార్పుల సందర్భంగానే చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది.

ఇందులో భాగంగానే అసెంబ్లీ, మండలి విప్‌ల నియామకాలు ఇటీవలె చేపట్టినా.. చీఫ్ విప్ నియామకాలను మాత్రం వాయిదా వేసినట్లు చర్చ జరుగుతోంది. మంత్రి పదవి రాని సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా ఉండే చీఫ్ విప్ పదవి ఇవ్వాలని భావిస్తున్నారు.డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తున్నట్లు గతేడాది జూన్‌లో ప్రకటించగా.. తనకు ఆ పదవి ఇష్టం లేదని.. మంత్రి పదవి కావాలని ఆయన కాంగ్రెస్ పెద్దలకు తేల్చి చెప్పేశారు. దీంతో ఇంతవరకు కూడా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదు. చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులకు కేబినెట్ హోదా ఉండటంతో మంత్రివర్గ విస్తరణ సందర్భంగా వీటిని కూడా భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

### బెంగాల్ కు చంద్రబాబు

## తమిళనాడుకు పవన్



న్యూఢిల్లీ, మార్చి 23,
దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అందుకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది ఎన్నికల కమిషన్. పశ్చిమబెంగాల్, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నేరుగా తలపడుతోంది అస్సాం, పశ్చిమ బెంగాల్లో.. అయితే తమిళనాడులో సైతం ఎన్డీఏ పరంగా గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. ఈ తరుణంలో తన మిత్రులను ఉపయోగించుకోవాలని చూస్తోంది. ప్రధానంగా ఏపీ నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లను ప్రచారానికి పిలిచినట్లు తెలుస్తోంది. ముగ్గురికి మూడు రాష్ట్రాలు ప్రచార బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. బిజెపి పెద్దలు కోరడంతో ఈ ముగ్గురు నేతలు సమ్మతించినట్లు తెలుస్తోంది.ఏపీ సీఎం చంద్రబాబును పశ్చిమ బెంగాల్లో ఎన్నికల ప్రచారానికి కేంద్ర పెద్దలు ఆహ్వానించినట్లు ప్రచారం సాగుతోంది. ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఏపీ సీఎం చంద్రబాబుతో గతంలో మంచి సంబంధాలు ఉండేవి. ఎన్డీఏ ను విభేదించినప్పుడు చంద్రబాబు మమతా బెనర్జీతో కలిసి రాజకీయ వేదికలు పంచుకున్నారు. అందుకే ఇప్పుడు చంద్రబాబును రంగంలోకి దించితే మమతా బెనర్జీని ఇరకాటంలో పెట్టవచ్చని కేంద్ర పెద్దల ఆలోచన. పైగా పశ్చిమ బెంగాల్లో తెలుగు ప్రజలు కూడా ఉన్నారు. వారిలో మెజారిటీ వర్గం చంద్రబాబు నాయకత్వాన్ని సమర్థిస్తూ ఉంటుంది. అందుకే చంద్రబాబుతో ప్రచారం చేయిస్తే వర్కౌట్ అవుతుందని కేంద్ర పెద్దల ఆలోచన. కేంద్ర పెద్దలు ఆహ్వానించేసరికి చంద్రబాబు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి రావాలని కేంద్ర పెద్దలు ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఆది నుంచి తమిళనాడు విషయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటారు. సనాతన ధర్మం నినాదం చేసేటప్పుడు ఎక్కువగా తమిళనాడు నుంచి అభ్యంతరాలు వచ్చాయి. వారికి అంతే ధీటుగా సమాధానాలు చెప్పారు పవన్ కళ్యాణ్. తమిళనాడులో ద్రవిడ సిద్ధాంతం బలంగా ఉంటుంది. సనాతన ధర్మంతో పవన్ కళ్యాణ్ ప్రజల్లోకి బలంగా వెళ్తున్న తరుణంలో.. తమిళనాడు లో ఆయన అయితే తట్టుకోగలరు అన్న నిర్ణయానికి కేంద్ర పెద్దలు వచ్చినట్లు తెలుస్తోంది. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో పవన్ కళ్యాణ్ ముమ్మరంగా పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.ఇంకోవైపు మంత్రి నారా లోకేష్ కు అస్సాం ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని కేంద్ర పెద్దలు ఆహ్వానించినట్లు తెలుస్తోంది. అక్కడ బిజెపి అధికారంలో ఉంది. మరోసారి నిలబెట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. అక్కడ యువ ఓటర్లు అధికం. వారిని ఆకట్టుకోవాలంటే లోకేష్ లాంటి యువనేత అవసరం. మొన్నటి ఎన్నికల్లో బీహార్లో నారా లోకేష్ ప్రచారం చేశారు. ఆ ప్రచారం ఫలించింది. లోకేష్ పాల్గొన్న ప్రాంతాల్లో ఎన్డీఏ ఘనవిజయం సాధించింది. అందుకే ఇప్పుడు అస్సాంలో ఎన్నికల ప్రచారం చేయాలని బిజెపి ఆహ్వానించేసరికి లోకేష్ సమ్మతించినట్లు సమాచారం. మొత్తానికైతే ముగ్గురు నేతలు ఎన్నికల ప్రచారంలో బిజీ కానున్నారు అన్నమాట.

## ఆదాయంలో రంగారెడ్డే టాప్...

హైదరాబాద్, మార్చి 24,
తెలంగాణలో అత్యధిక సంపన్న జిల్లాల జాబితాలో హైదరాబాద్ మరోసారి రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్ 2026 నివేదిక ప్రకారం, హైదరాబాద్ జిల్లాకు తలసరి ఆదాయం రూ.4,76,679గా నమోదై, రాష్ట్ర సగటు రూ.3,80,031 కంటే ఎక్కువగా ఉంది.తలసరి ఆదాయం అంటే ఒక జిల్లాలో ప్రతి వ్యక్తి సంవత్సరానికి సగటున సంపాదించే ఆదాయం. ఇది ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను అంచనా వేయడానికి కీలక సూచికగా భావిస్తారు. ఇక జీడీపీ అంటే జిల్లాలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఆర్థిక విలువ. ఇది ఆర్థిక పరిమాణాన్ని చూపుతుందిగానీ, వ్యక్తిగత ఆదాయాన్ని ప్రతిబింబించదు.

తెలంగాణలో టాప్ 10 ధనిక జిల్లాలు (తలసరి ఆదాయం ఆధారంగా):

తెలంగాణలో తలసరి ఆదాయం ఆధారంగా టాప్ 10 జిల్లాల జాబితా ఇలా ఉంది:

1. రంగారెడ్డి రూ.11,29,735
2. హైదరాబాద్ రూ.4,76,679
3. సంగారెడ్డి రూ.3,94,587
4. మేడ్చల్ మల్కాజిగిరి రూ.3,81,506
5. భద్రాది కొత్తగూడెం రూ.3,69,420
6. మహబూబ్‌నగర్ రూ.3,36,898
7. ములుగు రూ.3,35,509
8. యాదాద్రి భువనగిరి రూ.3,35,264
9. నల్గొండ రూ.3,30,216
10. మెదక్ రూ.3,29,209

ఈ జాబితాలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలవడం గమనార్హం.

ఉఆఆఖలో కూడా హైదరాబాద్ రెండో స్థానం:

జిల్లా ఆర్థిక పరిమాణాన్ని సూచించే ఉఆఆఖ పరంగా కూడా హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. ఉఆఆఖ ఆధారంగా టాప్ 10 జిల్లాలు:

1. రంగారెడ్డి రూ.3,41,080 కోట్లు
2. హైదరాబాద్ రూ.2,25,860 కోట్లు
3. మేడ్చల్ మల్కాజిగిరి ? రూ.1,16,133 కోట్లు
4. సంగారెడ్డి ? రూ.74,194 కోట్లు
5. నల్గొండ ? రూ.64,219 కోట్లు
6. నిజామాబాద్ ? రూ.49,974 కోట్లు
7. భద్రాది కొత్తగూడెం ? రూ.48,354 కోట్లు
8. ఖమ్మం ? రూ.47,184 కోట్లు
9. సూర్యాపేట్ ? రూ.38,865 కోట్లు
10. సిద్దిపేట ? రూ.37,495 కోట్లు

హైదరాబాద్ నగరానికి వెలుపల ఉన్న ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి జరగడం వల్ల రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం, ఉఆఆఖ రెండింటిలోనూ ముందంజలో ఉంది. ఐటీ, రియల్ ఎస్టేట్, పరిశ్రమల విస్తరణ ఈ జిల్లాలో భారీ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నాయి.

రంగారెడ్డి జిల్లా జనాభా: 24,26,243

హైదరాబాద్ జిల్లా జనాభా: 39,43,323

హైదరాబాద్ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి వేగం ఎక్కువగా ఉండటం వల్ల ఆర్థికంగా అది ముందంజలో ఉంది. తలసరి ఆదాయం, జీడీపీ పరంగా హైదరాబాద్ రెండో స్థానంలో నిలవడం నగర ఆర్థిక శక్తిని ప్రతిబింబిస్తోంది. అయితే వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లా తెలంగాణలో ఆర్థిక కేంద్రంగా మారుతున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

================

## యుద్ధం బూమ్ రాంగ్ అయిందా

న్యూఢిల్లీ, మార్చి 24,
పశ్చిమాసియాలో అగ్గి రాజేసిన అమెరికా రాంగ్ స్టెప్ వేశామా అని ఇప్పుడు మదన పడుతోంది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం 223 రోజులు అయినా కొలిక్కి రాలేదు. కానీ తాత్కలికంగా బ్రేక్ ఇచ్చారుసుదీర్ఘంగా కొనసాగుతోంది. ఇంకా ఎంతకాలం కొనసాగుతుందో తెలియడం లేదు. మ23 రోజుల తర్వాత కూడా ఇరాన్ తన దాడులను తగ్గించడం లేదు. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను టార్గెట్ చేస్తోంది. దీంతో అగ్రరాజ్యం తీవ్రంగా నష్టపోతోంది. యుద్ధం ప్రారంభమైన మొదటి రెండు వారాల్లోనే అగ్రరాజ్యాం రూ.7,520 కోట్లు నష్టపోయినట్లు బీబీసీ, సీఎస్ఐఎస్(సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్) నివేదికలు వెల్లడించాయి. ఇటువంటి దాడులు అమెరికా రక్షణ సాంకేతికత లోపాలను, ఇరాన్ ఆయుధ శక్తిని ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశం చేశాయి.ఇరాన్ దళాలు జోర్డాన్, ఇరాక్, సిరియాలో ఉన్న అమెరికా సైనిక ప్రాంతాలను లక్ష్యంగా దాడులు చేశాయి. అమెరికా ప్యాట్రియట్, థాడ్ వ్యవస్థలను అధిగమించే వేగవంతమైనహైపర్‌సోనిక్ క్షిపణులతో ఇరాన్ దాడిచేసింది. తక్కువ ఎత్తులో ప్రయాణించి రాడార్‌లను మోసం చేసే షాహెద్?136 డ్రోన్‌లతో అమెరికాకు ఎక్కువ నష్టం కలిగించింది. ఇరాన్ జరిపిన దాడుల్లో 20 విజయవంతమయ్యాయి. జోర్డాన్‌లో అల్ ? ఉదేస్‌కు సమీపంలో రాడార్ వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలాయి.ఇరాన్ జరిపిన దాడుల్లో అమెరికాకు చెందిన థాడ్ రాడార్ ధ్వంసమైంది. దీంతో రూ.4,200 కోట్లు నష్టపోయింది. జోర్డాన్ ప్రధాన యూనిన్ నాశనమైంది. పునరుద్ధణకు రెండేళ్లు పట్టే అవకాశం ఉంది. ఇక ఇతర రక్షణ పరికరాలు ధ్వంసం కావడంతో రూ.1,800 కోట్లు నష్టపోయింది.

## గన్ పార్క్ దగ్గర బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

హైదరాబాద్ మార్చి 24, గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ యుద్ధం ప్రారంభమయ్యాక ఎల్పీజీ కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రప్రభుత్వం కొరత లేదని ప్రజలకు నమ్మబలుకుతోంది. క్షేత్ర స్థాయిలో మాత్రం గ్యాస్ కొరత తీవ్రంగా ఉంది. కేంద్రం అధీనంలో పెట్రోలియం శాఖ ఉందని, తామేమీ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. ఫ్యూచర్లో గ్యాస్ సిలిండర్ సైజ్ తగ్గిస్తారన్న అనుమానాలున్నాయి. 14 కిలోల గ్యాస్ సిలిండర్ ను 10 కిలోలకు తగ్గిస్తారంట అని అన్నారు. సామాన్య ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పెడుతున్నాయి. ఆంబోతు కొట్లాటలో లేగలు బలైనట్లు సామాన్యుల పరిస్థితి. యుద్ధం కారణంగా గ్యాస్ కొరత చర్చనీయాంశంగా మారింది. కొరత లేదని కేంద్రం, సప్లయి లేదని రాష్ట్రం ప్రజలను మభ్యపెడుతున్నాయి.

# బలహీనమే తప్పు.. బలి?కాదు!

హైదరాబాద్, మార్చి 24
తెలంగాణ రాజకీయంలో అందరినీ తొలుస్తున్న ఏకైక ప్రశ్న గులాబీ బాస్‌ల అరెస్టు ఎప్పుడు? . గడప దాటిన ప్రతిచోటా, ప్రతి మీడియా సమావేశంలోనూ రేవంత్ రెడ్డికి ఎదురయ్యే ఈ ప్రశ్న వెనుక ఒక ఉత్కంఠ ఉంది. దానికి కారణం గతంలో రేవంత్ పై కేసీఆర్ చేసిన రాజకీయమే. అయితే, రేవంత్ రెడ్డి చట్టం తన పని తాను చేస్తుంది అనే వ్యూహమే పాటిస్తున్నారు. దీని వెనుక ఒక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉంది. ప్రత్యర్థులను జైలు పాలు చేయడం ద్వారా తక్షణ రాజకీయ మైలేజీ పొందడం కంటే, వారిని రాజకీయంగా నిరాయుధులను చేయడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారుఅరెస్టు అనేది రెండు అంచుల కత్తి. ఒక నాయకుడిని జైలుకు పంపడం ద్వారా అతడిని ప్రజల దృష్టిలో దోషిగా నిలబెట్టాలని అనుకుంటే, అది ఒక్కోసారి అతడిని రాజకీయ బాధితుడి గా మార్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కేటీఆర్, కేసీఆర్ వంటి నేతల్ని అరెస్టు చేస్తే, అది సోషల్ మీడియా యుగంలో అనూహ్యమైన సానుభూతిని నింపుతుంది. అక్రమ కేసులు పెట్టారనే ప్రచారం జరిగితే, అది బీఆర్ఎస్‌కు సంజీవనిలా మారుతుందని రేవంత్ రెడ్డికి బాగా తెలుసు. అందుకే, ఆవేశంతో సంకెళ్లు వేయడం కంటే, ఆధారాలతో వారిని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టడమే మేలని ఆయన భావిస్తున్నారు. కాళేశ్వరం వైఫల్యాలు, ఫోన్ ట్యాపింగ్ అక్రమాలను ప్రజల్లో నిరంతరం చర్చ జరిగేలా చూడటం ద్వారా వారి నైతిక పతనాన్ని శాశ్వతం చేయడమే రేవంత్ అసలు వ్యూహం.తెలుగు నేల రాజకీయ చరిత్ర రేవంత్ రెడ్డి ముందు స్పష్టమైన పాఠాలను ఉంచింది. గతంలో జగన్మోహన్ రెడ్డి 16 నెలల జైలు జీవితం ఆయనకు ప్రజల్లో ఒక విధమైన సానుభూతిని, తద్వారా అధికారాన్ని తెచ్చిపెట్టింది. చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో కూడా ప్రజల్లో వెల్లువెత్తిన మద్దతు, సానుభూతి పవనాలు రాజకీయ సమీకరణాలను మార్చేశాయి. కేసీఆర్ వంటి ప్రాంతీయ సెంటిమెంట్ ఉన్న నాయకుడిని అరెస్టు చేస్తే, అది మళ్లీ తెలంగాణ ఆత్మగౌరవం అనే సెంటిమెంట్‌ను రాజేసే అవకాశం ఉంది. తన పాలనపై దృష్టి పెట్టకుండా కేవలం పగ తీర్చుకుంటున్నారనే ముద్ర పడకుండా, రేవంత్ రెడ్డి అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.నిజానికి కేటీఆర్‌ను చట్టపరమైన చిక్కుల్లో నెట్టే అవకాశాలు వచ్చినా రేవంత్ ఆచితూచి అడుగు వేయడం వెనుక ఉన్న పక్కా పొలిటికల్ లెక్క ఇదే. జైలు గోడల మధ్య ప్రత్యర్థిని ఒక పొలిటికల్ హీరోగా మార్చడం కంటే, బయటే ఉంచి వారిపై ఉన్న ఆరోపణలను ఎండగట్టడం ద్వారా వారి విశ్వసనీయతను దెబ్బతీయడం అత్యంత ప్రభావవంతమైన మార్గం.

జైలుకు వెళ్తే వచ్చే సానుభూతి కంటే, బయట ఉండి సమాధానం చెప్పుకోలేక ఇబ్బంది పడటం వల్ల కలిగే నష్టమే ప్రత్యర్థికి ఎక్కువ. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే ఆయన కేవలం ఒక దూకుడున్న నాయకుడిగానే కాకుండా, రాజకీయ చదరంగంలో ఎప్పుడు ఏ పావును కదపాలో తెలిసిన పరిణతి చెందిన నాయకుడిగా కనిపిస్తున్నారు.మొత్తానికి రేవంత్ రెడ్డి వ్యూహం స్పష్టంగా ఉంది. ప్రత్యర్థులను జైలులో ఉంచి బలవంతులుగా మార్చడం కంటే, వారి తప్పులను ప్రజల ముందు ఉంచి బలహీనపరచడమే సరైన మార్గమని ఆయన నమ్ముతున్నారు. ఈ వేచి చూసే ధోరణి కాంగ్రెస్ కేడర్‌కు కొంత అసహనం కలిగించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకి మేలు చేస్తుందని ఆయన రాజకీయ లెక్కలు చెబుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థులకు సానుభూతి మైలేజీ ఇవ్వకుండా, చట్టపరమైన ప్రక్రియ ద్వారానే అంతిమ తీర్పు వచ్చేలా చూడటం రేవంత్ రెడ్డి మార్క్ పాలిటిక్స్ అనుకోవచ్చు

# డిస్కంలకు సింగరేణి షాక్

ఖమ్మం, మంచిర్యాల, మార్చి 24, (
సింగరేణి సంస్థ మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో నిర్మిస్తున్న 800 మెగావాట్ల కొత్త థర్మల్ ప్లాంట్ విద్యుత్తును తెలంగాణకు కాకుండా రాజస్థాన్‌కు విక్రయించాలని నిర్ణయించింది. ఇందుకోసం రాజస్థాన్ జెన్‌కోతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ డిస్కంలు చెల్లించాల్సిన రూ. 27,379 కోట్ల భారీ బకాయిలే ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. ఈ పరిణామం భవిష్యత్తులో తెలంగాణకు కరెంట్ కష్టాలతో పాటు వేల కోట్ల అదనపు ఆర్థిక భారాన్ని మోపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ షాక్ ఇచ్చింది. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లిలో కొత్తగా నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ విద్యుత్తును ఇప్పుడు రాజస్థాన్‌కు విక్రయించాలని సింగరేణి నిర్ణయించింది. దశాబ్దాలుగా తెలంగాణ గనుల నుంచి బొగ్గు తీస్తూ రాష్ట్ర పారిశ్రామిక, వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచిన సింగరేణి.. ఇప్పుడు తన సొంత రాష్ట్ర డిస్కంలకు కాకుండా పొరుగు రాష్ట్రమైన రాజస్థాన్ విద్యుదుత్పత్తి సంస్థతో జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటుకు సిద్ధమవ్వడం చర్చనీయాంశంగా మారింది.ప్రధానంగా ఆర్థిక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ప్రస్తుతం ఉన్న 1200 మెగావాట్ల ప్లాంటు నుంచి సరఫరా అవుతున్న విద్యుత్తుకు సంబంధించి డిస్కంలు దాదాపు రూ. 27,379 కోట్ల మేర బకాయిలు పడ్డాయి. ఈ భారీ ఆర్థిక లోటు వల్ల సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉండటంతో కొత్త ప్లాంటు విద్యుత్తును నగదు చెల్లింపులు సక్రమంగా చేసే ఇతర రాష్ట్రాలకు, ఓపెన్ మార్కెట్‌కు మళ్లించాలని సింగరేణి భావించినట్లు తెలిసింది. రాజస్థాన్‌కు థర్మల్ విద్యుత్ ఇచ్చి.. దానికి బదులుగా అక్కడ 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, ఆ కరెంటును వినియోగించుకోవాలనే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది.అయితే, ఈ నిర్ణయం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. రాష్ట్రానికి అదనపు థర్మల్ విద్యుత్ అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటు నిర్మాణానికి జెన్‌కోకు అనుమతి ఇచ్చింది. పెగడపల్లిలో ఇప్పటికే ఉన్న 1200 మెగావాట్ల ప్లాంటు పక్కనే కొత్త యూనిట్ నిర్మిస్తే భూసేకరణ భారం ఉండదు కాబట్టి మెగావాట్‌కు రూ. 12 కోట్ల ఖర్చుతోనే నిర్మాణం పూర్తవుతుంది. కానీ ఈ కరెంటును రాజస్థాన్‌కు అమ్మేసి భవిష్యత్తులో తెలంగాణ కోసం మరో చోట ప్లాంటు నిర్మించాలంటే మళ్లీ వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై అదనంగా భారం పడటమే కాకుండా, ప్రాజెక్టు పూర్తి కావడానికి ఏళ్ల సమయం పడుతుంది.మరోవైపు, పర్యావరణ నిబంధనలు కఠినతరం అవుతున్న తరుణంలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు అనుమతులు రావడం కష్టతరమవుతోంది. చేతిలో ఉన్న అవకాశాన్ని వేరే రాష్ట్రానికి ధారాదత్తం చేస్తే.. భవిష్యత్తులో తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి అవసరమైన చౌక విద్యుత్ లభ్యత తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. సింగరేణి టెండర్ ప్రక్రియను వేగవంతం చేస్తూ కన్సల్టెన్సీ సంస్థల కోసం ప్రకటన జారీ చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా కూడా దుమారం రేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో బకాయిల సమస్యను పరిష్కరించుకుని ఈ 800 మెగావాట్ల విద్యుత్తును రాష్ట్ర అవసరాలకే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# తెరపైకి కంటెస్టెడ్...

నిజామాబాద్, మార్చి 24,
రాజకీయాల్లో గెలిచిన నేతలకే పదవి, పలుకుబడి, గౌరవం ఉంటాయి. పనులు చేయించేది, ప్రజల తరఫున సమావేశాల్లో ప్రశ్నించేది కూడా పదవిలో ఉన్నవారే. మెజారిటీ సీట్లు గెలిస్తే అధికారపక్షం అంటారు.. తక్కువ సీట్లు వస్తే ప్రతిపక్షంలో కూర్చుంటారు. ప్రజాస్వామ్యంలో ఇది కామన్. కానీ కరీంనగర్‌లో ఎన్నికల్లో ఓడిన నేతలు కూడా పెత్తనం చెలాయించే వ్యూహం రూపొందిస్తున్నారు. గెలిచిన ప్రజాప్రతినిధులతో సమానంగా 'కంటెస్టెడ్ ఎమ్మెల్యే', 'కంటెస్టెడ్ కార్పొరేటర్' గా స్వయంగా ప్రకటించుకుంటున్నారు. ఈమేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాహనాలకు స్టిక్కర్లు పెట్టుకుంటున్నారు. విజిటింగ్ కార్డులు ఇస్తున్నారు. ఈ వింత పరిణామం స్థానిక పాలనలో గందరగోళాన్ని సృష్టిస్తుంది.కరీంనగర్ కార్పొరేషన్‌లో 66 డివిజన్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ కార్పొరేటర్ స్థానాలు గెలిచి పీఠం దక్కించుకుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ జరిగింది. అధికార కాంగ్రెస్ పీఠం కోసం సర్వశక్తులు ఒడ్డినా ప్రజలు కమలం వైపే మొగ్గుచూపారు. ఫలితాల తర్వాత కూడా బీఆర్ఎస్, స్వతంత్ర అభ్యర్థులను కలుపుకుని పీఠం కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ప్రయత్నాలు చేశారు. కానీ బీఆర్ఎస్ హ్యాండ్ ఇవ్వడంతో కాంగ్రెస్ ఆశలు ఆవిరయ్యాయ. ఇక ఓడిపోయిన నాయకులు పార్టీలోని నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'కంటెస్టెడ్' పేరుతో సొంతంగా లేని పదవులు సృష్టించుకుని అధికారం చెలాయించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఇది కొత్త ట్రెండ్‌గా మారింది.ఈమేరకు పెద్ద ఫ్లెక్సీలపై 'కంటెస్టెడ్' ఎమ్మెల్యే/కార్పొరేటర్' అని పేరుపెట్టి రోడ్లపై ఏర్పాటు. మానకొండూరు, కరీంనగర్ కార్పొరేషన్ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొందరు కార్లపై స్టికర్లు అంటించుకుని అధికారిక స్థాయిలో తిరుగుతున్నారు. మరికొందరు కలెక్టర్లు, ఎమ్మెల్యేల కార్యాలయాల్లో విజిటింగ్ కార్డులతో హాజరవుతుఆన్నరు. స్థానిక సమస్యల సమావేశాల్లో ప్రధాన అతిథులుగా పాల్గొంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓడిపోయిన అభ్యర్థులు ఎక్కువగా ఈ వ్యవహారం నడిపిస్తున్నారు.కంటెస్టెడ్ ట్రెండ్‌ను గెలిచిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికార దుర్వినియోగంగా పేర్కొంటున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేస్తూ, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పార్టీ స్థాయిలో డిసిప్లినరీ చర్యలు, పబ్లిక్ హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ప్రజల్లో గందరగోళం పెరిగి, నిజ అధికారులను గుర్తించడం కష్టమవుతోంది.

## తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోడీ...

హైదరాబాద్, మార్చి 24,
ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ మొదటి వారంలో తెలంగాణలో పర్యటించనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు, మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు హైదరాబాద్‌కు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా నగరంలో నిర్వహించే ఒక భారీ బహిరంగ సభకు ఆయన హాజరవుతారు. అక్కడి నుంచే వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుడతారని సమాచారం. లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని మోదీ తెలంగాణకు రావడం ఇదే తొలిసారి కావడంతో, ఈ పర్యటనపై రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 8 స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటిందిఈ పర్యటనలో భాగంగా వరంగల్‌లోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బీబీనగర్ ఎయిమ్స్ లో కొత్తగా నిర్మించిన పలు బ్లాకులు, అలాగే పూర్తయిన జాతీయ రహదారులను ప్రధాని ప్రారంభించనున్నారు. వీటితో పాటు, హైదరాబాద్ నుండి యాదాద్రి వరకు ప్రతిపాదించిన ఎంఎంటీఎస్ రెండో దశ రైల్వే ప్రాజెక్టుకు, ప్రాంతీయ వలయ రహదారి ఉత్తర భాగానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని భావిస్తున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై పార్టీ పరంగా సమాచారం రావడంతో ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో శనివారం జరిగిన పార్టీ నేతల సమావేశంలో ఈ విషయంపై ప్రాథమికంగా చర్చించారు. ప్రధాని మోదీ అధికారిక పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, కార్యక్రమాల టైమింగ్స్‌పై కేంద్ర ప్రభుత్వం నుండి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్ కార్పొరేషన్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి.

# ఏప్రిల్ 5న ముహూర్తం



కరీంనగర్, మార్చి 24,
కాంగ్రెస్ పార్టీకి జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రాజీనామా చేశారు. కొంతకాలంగా పార్టీ నాయకత్వంపై ఆయన ఆగ్రహం గా ఉన్నారు. తన విషయంలో పార్టీ వ్యవహరిస్తున్న తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. సంజయ్ చేరిక తర్వాత జీవన్ రెడ్డి లో ఆగ్రహం మరింత పెరిగిపోయింది. తనకు అంతగా ప్రాధాన్యం లభించడం లేదని.. తన అనుచరులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. తన ప్రధాన అనుచరుడిని కొంతమంది వ్యక్తులు హ×త్య చేశారని.. కేసు విషయంలో పోలీసులను కలిసినప్పటికీ న్యాయం జరగలేదని జీవన్ రెడ్డి చెబుతున్నారు.జీవన్ రెడ్డి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన గులాబీ పార్టీలో చేరడం ఖాయం అయిపోయింది. మొన్న జగిత్యాల నగరంలో నిర్వహించిన రంజాన్ వేడుకలలో ఆయన గులాబీ పార్టీ నేతలతో కలిసి పాల్గొన్నారు. దీంతో తన తదుపరి రాజకీయ ప్రయాణం గులాబీ పార్టీ నుంచి అని ఆయన సంకేతాలు ఇచ్చారు. ఏప్రిల్ 5న ఆయన గులాబీ పార్టీలో చేరుతారని తెలుస్తోంది. జగిత్యాల నగరంలో భారీ సభ ఏర్పాటు చేసి.. జీవన్ రెడ్డి గులాబీ పార్టీ కండువా కప్పుకోబోతున్నారని సమాచారం. ఇటీవల జీవన్ రెడ్డితో మంత్రులు శ్రీధర్, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం మాట్లాడారు. అనేక రకాలుగా బుజ్జగింపులు చేశారు. అయినప్పటికీ జీవన్ రెడ్డి దిగి రాలేదు. తన నిర్ణయం ఫైనల్ అని స్పష్టం చేశారు?.గులాబీ పార్టీలో జీవన్ రెడ్డి మాత్రమే కాకుండా, ఆయన అనుచరులు కూడా భారీగా చేయబోతున్నారని తెలుస్తోంది. అయితే కొంతమంది రాజకీయ విశ్లేషకులు జీవన్ రెడ్డి గులాబీ పార్టీలో చేరే విషయంపై ఒక ఆసక్తికరమైన చర్చను తెరపైకి తీసుకొచ్చారు. డిలిమిటేషన్ తర్వాత నియోజకవర్గాల పెంపు జరుగుతుందని.. అప్పుడు జగిత్యాల నుంచి జీవన్ రెడ్డి కోడలు చరిష్మారెడ్డి పోటీ చేస్తారని చెబుతున్నారు. దాన్ని అంచనా వేసి జీవన్ రెడ్డి గులాబీ పార్టీలో చేరుతున్నారని సమాచారం. మరోవైపు జీవన్ రెడ్డికి గులాబీ పార్టీ మంచి పదవి ఆఫర్ చేసినట్టు తెలుస్తోంది. ఆయనకు పార్టీ జనరల్ సెక్రెటరీ పదవి కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది.ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో జీవన్ రెడ్డి అనుచరులకు కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇవ్వలేదు. దీంతో ఆయన తన అనుచరులను స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దింపారు. వారి తరఫున ప్రచారం కూడా చేశారు. పోటాపోటీగా సాగిన ఎన్నికల్లో వారిని గెలిపించుకున్నారు.

# జల్ జీవన్ మిషన్ 2.0పై భారత ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి మార్చి 24,
జల్ జీవన్ మిషన్ 2.0పై భారత ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకుంది. ఢిల్లీలో జరిగిన ఎంవోయూ కార్యక్రమంలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్




పాల్గొన్నారు.
, క్యాంప్ కార్యాలయం నుంచి జూమ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, వర్చువల్ గా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. 2028 డిసెంబర్ నాటికి 'హర్ ఘర్ జల్' సాకారం చేసేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఎంఓయూ వుంటుంది.
జల్ జీవన్ మిషన్ కొనసాగిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన నేతలు
. ప్రతీ ఇంటికి సురక్షిత, స్థిరమైన తాగు నీటిని అందించాలనేది తమ లక్ష్యమని సీఎం చెప్పారు. ఎన్నికల హామీల్లో ఇది కూడా ఒకటని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని పేర్కొన్నారు.
పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనికి కేంద్రం సహకరించాలని సీఎం కోరారు.
ఎంఓయూలో కేంద్ర జల్ శక్తి కార్యదర్శి అశోక్ కుమార్ మీనా, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ పాల్గొన్నారు.
తాజా ఎంఓయూతో మౌలిక సదుపాయాల కల్పన, పంచాయతీల ఆధ్వర్యంలో కుళాయిల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించారు. గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థల ఆపరేషన్, మెయింటెనెన్స్కు ఏపీ ప్రభుత్వ ప్రాధాన్యం, 2025 సెప్టెంబర్లో జేజేఎం అమలుపై సమగ్ర విధానాన్ని రాష్ట్రం ప్రకటించింది. తాగునీటి సరఫరా వ్యవస్థల నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు.

## మామూళ్ల మత్తులో బెజవాడ ఖాకీలు

విజయవాడ మార్చి 24, విజయవాడ నగరంలో అతి రద్దీగా ఉండే రోడ్లలో ప్రధానమైన రహదారి 5 రూట్. ఈ రూట్ నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఉదయం వేళ సాయంత్రం వేళ ఈ రూట్ లో ప్రతినిత్యం ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుంది. ఉదయం 10 గంటల సమయంలో టైల్స్ లోడుతో వెళ్ళే లారీ 5 రూట్ లోకి వచ్చింది పుష్ప హోటల్ సెంటర్ సిగ్నల్ దాటుకొని నైస్ బార్ సిగ్నల్ వద్దకు చేరింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ లారీని పక్కకు ఆపి బహిరంగంగా మామూలు తీసుకుని లారీని అక్కడి నుంచి పంపించారు. విజయవాడ నగరంలో ఉదయం సాయంత్రం వేళ ఉండే రద్దీతో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్కును క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు తమ డ్యూటీ కాదంటూ కేవలం జరిమానాలకే పరిమితమయ్యారు. ఉదయం ట్రాఫిక్ పోలీసులు సాయంత్రం లా అండ్ ఆర్డర్ పోలీసులు రోడ్లపై గుంపులు గుంపులుగా వాహనాలను ఆపుతూ జరిమానాలు విధిస్తున్నారు. జరిమాణాలు విధించడంపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో లేదని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నెల్లూరు లో మంత్రులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మీయ స్వాగతం

నెల్లూరుమంగళవారం నెల్లూరు కు వచ్చిన పలువురు మంత్రులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్వాగతం పలికారు. మంత్రులు కొల్లు రవీంద్ర, ఎన్ఎండి ఫరూక్, మాజీ మంత్రి టిడిపి నేత మోపిదేవి వెంకటరమణకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారుత. నెల్లూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో భేటి అయ్యారు.

## ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ఒంటిమిట్ట / తిరుపతి, 2026 మార్చి 24 ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మార్చి 27 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో సంప్రదాయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటల నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుని సన్నిధులు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.అనంతరం ఉదయం 11.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

## విజయవాడ ,మచిలీపట్నంలో ఏసీబీ సోదాలు

మచిలీపట్నం ఏఎంవీఐ (ంఓఎఎ) పిల్లోట్ల లోకనాథ ప్రసాద్ నివాసాల్లో అవినీతి నిరోధక శాఖ (ంఞః) అధికారులు మంగళవారం ఉదయం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదుల నేపథ్యంలో విజయవాడ ఏసీబీ అధికారులు ఈ చర్యలకు దిగినట్లు సమాచారం.లోకనాథ ప్రసాద్‌కు సంబంధించిన ఆస్తులపై విచారణలో భాగంగా విజయవాడలోని చుట్టుగుంట (పాత ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్ రోడ్)లో ఉన్న ఆయన నివాసంతో పాటు, ఆయన సోదరుడి ఇంట్లో కూడా అధికారులు ఒకేసారి తనిఖీలు చేపట్టారు.

భారత శక్తి
25-3-2026 , బుధవారం

## చౌదర్ గూడెం గ్రామంలో గ్రామదేవతల ప్రతిష్టాపనకు మెదక్ ఎమ్మెల్సీ డా.అంజిరెడ్డి గోదావరి లకు ఆహ్వానం

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి,భారత శక్తి, మార్చ్ 24 :
సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ 17వ వార్డు చౌదరి గూడెం గ్రామంలో ఏప్రిల్ 3 శుక్రవారం రోజున గ్రామదేవతల ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్సీ డా. అంజిరెడ్డి, భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డిలను గ్రామదేవతల ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాల్సిందిగా గ్రామస్తులతో కలిసి ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్ పటేల్ కమిటీ సభ్యులు నల్లగండ్ల అనిల్ కుమార్ ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ హరి ప్రసాద్ ఎం.మల్లారెడ్డి ఎం.అశోక్, నిఖిల్ కుమార్ పోతరాజు విజయ్ మామిడిపల్లి విజయ్ నర్సింలు పెగడ మల్లేష్ మామిడిపల్లి సతీష్ కలిసి ఆహ్వానించడం జరిగింది,ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి లు మాట్లాడుతూ భారత సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షణలో



భాగంగా గ్రామ దేవతల ప్రతిష్టాపన కార్యక్రమానికి విచ్చేస్తానని, గ్రామ అభివృద్ధికి హిందూ సంప్రదాయాల పరిరక్షణకు గ్రామదేవతల ప్రతిష్ట ప్రతిష్టాత్మకమని సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఆహ్వానానికి విచ్చేసిన డాక్టర్ నలగండ్ల అశోక్ కుమార్ పాటిల్, గ్రామ ప్రజలను అభినందించడం జరిగింది.

## వేసవికాలం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి: అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చి 24(భారత శక్తి) వేసవికాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు.

వేసవికాల ప్రణాళికపై సంబంధిత అధికారులతో మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, తీవ్రమైన ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. వడదెబ్బన బారినపడిన ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలలోనే మెరుగైన చికిత్స అందించాలని అన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేలా, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బస్టాండ్లు, ప్రధాన కూడళ్ళు, జన సంచారం అధికంగా ఉన్న ప్రదేశాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజలకు విరివిగా ఓఆర్ఎస్ పొట్లాలు పంపిణీ చేస్తూ ఉండాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీ కూలీలు అధిక ఉష్ణోగ్రత సమయంలో జాగ్రత్తవగా ఉండాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ, వడదెబ్బ సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే జనాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు.

జిల్లాలో ఎక్కడా కూడా ప్రజలకు త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైనచోట బోరు బావులకు మరమ్మత్తులు తక్షణమే చేపట్టాలన్నారు. ఎక్కడైనా నీటి ఇబ్బందులు ఏర్పడితే, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, సమస్యలు తీర్చాలన్నారు.

వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువ సంభవించేందుకు ఆస్కారం ఉన్నందున అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## నీటి సంరక్షణలో మహిళల పాత్ర కీలకం: భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్ బాబు




నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చి 24(భారత శక్తి) మామడ మండలంలోని బందల్ ఖానాపూర్ గ్రామంలో మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో 'అవల్ రూరల్ లైవిలిహుడ్ ఎంపవర్ మెంట్ సొసైటీ' (స్వచ్ఛంద సంస్థ) సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించారు. 'నీరు, లింగ సమానత్వం' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు పి. శ్రీనివాస్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా భూగర్భ జలాలను పొదుపుగా వాడుకోవాలని, భావి తరాల కోసం నీటి సంరక్షణ పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా నీటి నిర్వహణలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, వృధాగా పోయే ప్రతి నీటి బొట్టును భూమిలోకి మళ్లించాలని కోరారు. గ్రామస్థులంతా నీటి పొదుపును ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో నీటిని పొదుపుగా వాడుతూ ఆదర్శంగా నిలుస్తున్న పలువురిని ఈ సందర్భంగా శాఖా పరంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం టీ బి పై ఆరోగ్య శ్రద్ధ వహించాలి:కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి ప్రతినిధి, మార్చి 24 (భారతశక్తి) ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందనీ టీబీపై పోరాటం మన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన టీబీ దినోత్సవంలో మున్సిపల్ కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత టీబీ స్క్రీనింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూటీబీపై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని సూచించారు.ప్రభుత్వం టీబీ నిర్మూలనకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని ముఖ్యంగా టీబీ రహిత తెలంగాణ కోసం మన జిల్లాకు మొబైల్ ఎక్సరే మిషన్ ను అందించడం జరిగిందని అన్నారు. జిల్లా లో టీబీ నిర్మూలనకు 35 గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలలో మొబైల్ ఎక్సర్ ద్వారా ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ చేపట్టి 6 నెలలు పాటు చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. లక్షణాలు గుర్తించిన వ్యక్తులకు ఉచిత వైద్య సేవలతో పాటు పోషణ కిట్లను సైతం అందించడం జరుగుతుందని తెలిపారు

.మున్సిపల్ కార్మికులు, ఆశా కార్యకర్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సైనికులని అభినందించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యాచరణలో భాగంగా మున్సిపల్ కార్మికులకు, ఆశా సిబ్బందికి ప్రత్యేకంగా వైద్య శిభిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిని, మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారుమున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధిసోకిన వ్యక్తులను గుర్తించి వైద్య సేవలు అందించి పరిపూర్ణ ఆరోగ్య వంతులుగా మార్చాలని తెలిపారు. వైద్యసేవలు అందించే వైద్య సిబ్బంది ప్రజలకు దేవుళ్ళతో సమానమని తెలిపారు.

అనంతరం మొబైల్ ఎక్స్ రే ద్వారా మున్సిపల్ కార్మికుల కు ఛాతీ ఎక్స్ రే తీయు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య సైతం ఎక్స్ రే తీపించు కున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్ అప్పం కిషన్, వైద్యులు డా ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్య వైద్య వ్యవసాయ రంగాల అభివృద్ధికి హెచ్డిఎఫ్సి బ్యాంకు నిధులు మంజూరు

భూపాలపల్లి ప్రతినిధి, మార్చి 24 (భారతశక్తి) జిల్లాలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులు కేటాయించడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హర్షం వ్యక్తం చేశారు.

మంగళవారం మహా ముత్తారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌డిఎఫ్‌సి సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్మార్ట్ తరగతి గదులు, ఆధునికీకరించిన మరుగుదొడ్లు, ఎంఆర్సి భవనం మరియు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటపరికరాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.

అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి ఈ నిధులు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం అవగాహన కల్పించేందుకు హెచ్ డి ఎఫ్ సి ఎక్స్‌పోజర్ విజిట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలను హెచ్‌డిఎఫ్‌సి సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సి ఎస్ ఆర్ నిధులు ద్వారా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేయాలని సూచించారు.

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక



చొరవతో సిఎస్ఆర్ నిధుల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, హెచ్‌డిఎఫ్‌సి జోనల్ మేనేజర్ రుణాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి బాబూరావు, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా. కుమారస్వామి, తహశీల్దార్ శ్రీనివాస రావు, ఎంపిడిఓ.ప్రకాష్,

ఎంఈఓ రవీందర్ రెడ్డి, హెచ్‌డిఎఫ్‌సి ఏరియా మేనేజర్ సంపత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి ప్రతినిధి, మార్చి 24 (భారతశక్తి) పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. తక్షణం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

మంగళవారం మహా ముత్తారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అపరిశుభ్రతగా ఉంటే పరిసరాల్లోకి విష జంతువులు వచ్చే అవకాశం ఉన్నందున, విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు.

అందువల్ల తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పాఠశాల ప్రాంగణాన్ని పూర్తిగా పరిశుభ్రంగా మార్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. చేపట్టిన పారిశుద్ధ్య పనుల ఫోటోలను తనకు పంపించాలని సూచించారు. అదనంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతూ పచ్చదనం పెంచాలని సూచించారు.

ఈ సందర్భంగా పాఠశాలకు వెళ్లే రోడ్డు నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు మరియు విద్యుత్ పనులను వెంటనే ప్రారంభించి, బుధవారం నుండి పనులు వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంచినీటి సరఫరా విషయమై మిషన్ భగీరథ అధికారులు పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

తనిఖీ అనంతరం జిల్లా కలెక్టర్ 10వ తరగతి విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడారు. హాలో స్టూడెంట్స్ ఎలా ఉన్నారు? ఇప్పటి వరకు ఎన్ని పరీక్షలు వ్రాసారు? ఎలా వ్రాసారు? ఇంకా ఎన్ని పరీక్షలు మిగిలి ఉన్నాయి?" అని అడిగి తెలుసు కున్నారు. మిగిలిన పరీక్షలను కూడా విజయవంతంగా పూర్తి చేయాలని, బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈఓ రాజేందర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ ప్రకాష్, సర్పంచ్ బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముందు జరుగు ధర్నా జయప్రదం చేయండి: సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపు

సూర్యాపేట(భారత శక్తి) మార్చి 24:
జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మరియు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 30వ తేదీన సూర్యాపేట జిల్లా కలెక్టర్



కార్యాలయం ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. ఈరోజు ఎం.వి.ఎన్ భవన్లో జరిగిన ప్రజాసంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి పథకంగా మార్చి పేదల పొట్ట కొడుతుందని అన్నారు. ఉపాధి చట్టాన్ని విబిజీ రామ్ జీ బిల్లుగా మార్చి నిధుల్లో కోత పెడుతూ పేదలకు ఉపాధి లేకుండా చేస్తుందన్నారు. విద్యుత్ సవరణ చట్టం తీసుకువచ్చి రైతాంగాన్ని ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను తొలగించి లేబర్ కోడ్ ల ద్వారా వారి హక్కులను కొల్లగొడుతుందన్నారు. కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా వాళ్లతో వెట్టి చాకిరి చేయించుకోవడం కోసమే లేబర్ కోడెలను తీసుకొచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వి బి జి రామ్ జి బిల్లు రద్దుచేసి ఉపాధి హామీ చట్టాన్ని కి అధిక నిధులు కేటాయించి యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అన్ని రంగాలకు సమ ప్రాధాన్యత కల్పించలేదన్నారు. పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఆర్ గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించి వాటికి బడ్జెట్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్ అయిందన్నారు. రైతాంగానికి పెట్టుబడి కోసం వ్యవసాయం ప్రారంభ సీజన్లో ఇవ్వాల్సిన రైతు భరోసా నిధులు ఇవ్వడంలో జాప్యం చేసి ప్రకటించిన తర్వాత కూడా అందరికీ సక్రమంగా అందజేయడం లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయాల పేరుతో అధికార ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయే తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం లేదన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు కోసం సిపిఎం పార్టీ అనేక పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యం చేసి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉద్యమాలు పాదయాత్రలు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగానే ఈనెల 30వ తేదీన సూర్యాపేట జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే భారీ ధర్నాలో సమస్యలతో బాధపడే ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొలిశెట్టి యాదగిరిరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న, టిపిటిఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు జే నరసింహారావు, జిఎంపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు వీరబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పర్యాటక అభివృద్ధిపై నివేదికలు సమర్పించాలి: జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చ్ 24 (భారతశక్తి) : ములుగు జిల్లాలోని పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరచేందుకు సంబంధిత శాఖలు సమగ్ర నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులనుఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం మంగళవారం నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. టూరిజం మాస్టర్ ప్లాన్ లో భాగంగా , జిల్లాలోని అన్ని చారిత్రక దేవాలయాలను, పురాస్తు కట్టడాలను, ప్రకృతి అందాలకు కొలువైన ఏటూరు నాగారం, తాడ్వాయి, ప్రపంచ ప్రఖ్యాత గాంచిన రామప్ప ఆలయం, మేడారం , గోదావరి నదీ తీరం, జల విహారాలు, తరితర ప్రాంతంలో పర్యాటక మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశం లో డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, టూరిజం మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్, ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 24 (భారత శక్తి): ములుగు జిల్లా కేంద్రం లో అంబెడ్కర్ విగ్రహం వద్దా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలభిషేకమ్ చేసిన కాంగ్రెస్ నాయకులు. అసెంబ్లీ సమావేశం లో రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారులకు 5 లక్షల జీవితాభిమా ప్రకటించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాసులు పేల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకుని సంబరాలు జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ బానోతు రవిచందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింత నిప్పుల బిక్షపతి, రియాజ్ మీర్జా, భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జన్ను రవి. కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా విద్యా బోధన సాగాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ జిల్లా ప్రతినిధి మార్చి ,24(భారత శక్తి)ప్రభుత్వ బడుల్లో, విద్యార్థుల సామర్థ్యాల పెంపుదలనే లక్ష్యంగా విద్యాబోధన సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అన్నారు.

మంగళవారం సారంగాపూర్ మండలం చించోలి బి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వారితో మాట్లాడుతూ, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారో లేదో వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా బడికి రావాలని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అన్ని శ్రద్ధగా వినాలని పేర్కొన్నారు. వేసవికాలం వల్ల మధ్యాహ్నం నుంచి పాఠశాలకు సెలవు ఉంటుందని, మధ్యాహ్నం వేళల్లో ఎండ అధికంగా ఉన్నందున విద్యార్థులు బయట తిరగకుండా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. భోజనశాల లేదన్న విషయం విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్ భోజనశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, ప్రతిరోజు విద్యార్థులందరికీ ప్రతిరోజు శుచి శుభ్రతలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. పిల్లలకు ఎటువంటి సమస్యలు కలగకుండా చూసుకోవాలని వివరించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ, ఇప్పటివరకు పూర్తయిన పరీక్షలు, ఇంకా మిగిలి ఉన్న పరీక్షల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పరీక్షలన్నీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. పరీక్షలపై ఎటువంటి భయం అవసరం లేదని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులతో బోర్డుపై గణితం లెక్కలను చేయించారు.

అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం నాణ్యవంతంగా ఉందని ప్రశంసించారు. మిగతా పనినంతటిని త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశం చేసుకోవాలన్నారు.

ఈ తనిఖీలలో డీఈవో భోజన్న, తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత రావు, సర్పంచ్ సాయన్న, పంచాయితీ కార్యదర్శి సౌజన్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణానికి ఆహ్వానం

## ఎమ్మెల్యే గూడెం మైపాల్ రెడ్డి నీ ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు



పటాన్ చెరువు, (భారత శక్తి ) మార్చ్ 24:

శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 25 నుండి 29 వరకు నిర్వహించనున్న శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ మంగళవారం సాయంత్రం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి, ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా గణపతి పూజ, కళ్యాణం, అన్నప్రసాద వితరణ, స్వామి వార్ల ఊరేగింపు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ప్రధాన అర్చకులు నరసింహచార్యులు, పూజారులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం: పటాన్చెరు శాసనసభ్యులు

## -రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్ చెరువు, (భారత శక్తి) మార్చ్ 24: పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన పక్షంలో ఉద్యమాలకు సైతం సిద్ధమని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.

మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాఘనీయమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్ డీలర్ కు 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింటలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చు: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 24 (భారత శక్తి): క్షయ (టీబీ) వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే నయం చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ -క్షయ వ్యాధి దినోత్సవం, 'క్షయ వ్యాధి -ముక్తుభారత్ రెండవ విడత కార్యక్రమానికి మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ముఖ్యఅతిథిగా పాల్గొని పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి నుండి డి ఎం అండ్ హెచ్ ఓ కార్యాలయం వరకునిర్వహించారు. అనంతరం డి ఎం హెచ్ ఓ డాక్టర్ గోపాలరావు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ టిబినీ మనం అందరం అంతం' చేయవచ్చు అనే ఈ సంవత్సర- అనే నినాదంతో "ములుగు జిల్లాలో ఎంపిక చేయబడిన గ్రామాలలో క్షయ వ్యాధి నిర్ధారణ, వ్యాధి అరికట్టే చర్యలు, వ్యాధి చికిత్స పట్ల విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులును ఆదేశించారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో గ్రామాలలోని ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సమాజంలోని ప్రతి ఒక్కరు తమ విధిగా ముందుకు వచ్చి, క్షయ వ్యాధి నిర్మూల న కార్యక్రమంలో పాలుపంచుకున్నప్పుడే క్షయ రహిత జిల్లాగా ములుగు మారుతుందని తెలిపారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ, టీబి వ్యాధి ఒక బ్యాక్టీరియా వల్ల వస్తుందని, టిబి వ్యాధి గ్రస్తుల నుండి వారు మాట్లాడినప్పుడు లేదా దగ్గినప్పుడు తుంపర్లు గాలి ద్వారా ఒకరి నుండి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుందని అన్నారు. టీబి ముక్తు భారత్ కార్యక్రమం మంగళవారం నుండి రెండవ విడత వందరోజుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. 14 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి టీబి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని, ములుగు జిల్లాలో ఎంపిక చేయబడిన 20 గ్రామాలలో మొబైల్ ఎక్స్రే మిషన్ ద్వారా అందరికీ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని, దానితోపాటు అసంక్రమిక వ్యాధులైన మధుమేహము రక్తపోటు హిమోగ్లోబిన్ పరీక్షలు కూడా చేస్తామని, నిర్ధారణ అయినా రోగులకు వెంటనే టీబి చికిత్సను మొదలు పెడతామని, దీని ద్వారా టీబి వ్యాప్తి అరికట్టవచ్చునని వివరించారు. రెండు వారాల నుండి జ్వరము దగ్గు బరువు తగ్గడం ఇలాంటి వారికి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో "తెమడ ను

సిబినాట్ "పరీక్షలు నిర్వహిస్తామని దీని ద్వారా వ్యాధి నిర్ధారణ అవుతుందని , జి.జి.హెచ్ సూపరింటెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ సర్వీసెస్ డాక్టర్ జగదీశ్వర్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నాగ అనీష్, మాస్ మీడియా అధికారి సంపత్, ప్రోగ్రామ్స్ డిపిహెచ్ఎం శకుంతల, మానిటరింగ్ సూపర్వైజర్ వెంకట్ రెడ్డి, సురేష్ బాబు, సూపర్వైజర్స్ నిర్మల, మేరీ దేవమ్మ, జిల్లాటీబి ప్రోగ్రాం సిబ్బంది రమేష, రాజు,చందు, ఆరోగ్య కార్యకర్తలు ఉమా, భాస్కర్ రాజన్న రవి హరి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గృహ జాబితా, గృహ గణన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 24: ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ఒ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఐఏఎస్ ఆదేశాల మేరకు సెన్సస్--2027కు సంబంధించిన దశ--1 గృహ జాబితా, గృహ గణన (హెచ్ఎల్ఓ) కార్యక్రమం నిర్వహణకు సంబంధించి ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ విక్టర్ ఆద్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా గృహ జాబితా, గృహ గణన కార్యక్రమం 2026 మే 11 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్యూమరేటర్లు , సూపర్‌వైజర్ల కు శిక్షణ సందర్భంగా జిల్లా/ఉపజిల్లా అధికారులు, ఛార్జ్ అధికారులు, ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు , ఫీల్డ్ ట్రైనర్లు వంటి జనాభా గణన 2027 పనులకు కేటాయించిన అధికారులకు ముందస్తుగా శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని అదనపు కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లాలోని ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు కు లెవల్--1 శిక్షణా కార్యక్రమం 24.03.2026 నుండి 26.03.2026 వరకు నిర్వహించడం జరుగుతుందని

ఈ శిక్షణ కార్యక్రమం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో 3 రోజులపాటు 24 నుండి 26 వరకు ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

# అన్ని శాఖలు కలిసి సమర్థవంతంగా జాతీయ విపత్తులను ఎదుర్కోవాలి : అదనపు కలెక్టర్ విక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 24: కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్ డి ఎమ్ ఏ) ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణపై టేబుల్‌టాప్ వ్యాయామం అదనపు కలెక్టర్ విక్టర్ రెవెన్యూ ఆద్వర్యంలో నిర్వహించడం జరిగింది.

ఈ వ్యాయామం ముఖ్యంగావరదల వంటి విపత్తుల సమయంలో ముందస్తు సిద్ధత శాఖల మధ్య సమన్వయం అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనపై అంశాలపై దృష్టి సారించింది. వివిధ శాఖల అధికారులు పాల్గొని:తమ బాధ్యతలు చర్చించారు.

అనుకరణ (సిమ్యులేషన్) ద్వారా పరిస్థితులను అంచనా వేశారు.

సమాచారం పంచుకోవడం, సహాయక చర్యలు, పునరావాసంపై చర్చించారు.

అగ్నిమాపక శాఖ తమ అత్యవసర వ్యూహాలను వివరించింది.

అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడానికి ముందస్తు ప్రణాళిక అవసరమని,

సమాజంలో అవగాహన కూడా చాలా ముఖ్యమని తెలిపారు.

ఎన్ డి ఎమ్ ఏ సూచనలను కూడా పరిగణలోకి తీసుకుని, జిల్లా విపత్తు నిర్వహణ వ్యవస్థను మెరుగుపరచాలని నిర్ణయించారు.


# రబీ మార్కెటింగ్ సీజన్ ప్యాడి కొనుగోలు ఓపిఎమ్ఎస్ ఎంట్రీలపై జిల్లా స్థాయి అవగాహన , శిక్షణ కార్యక్రమం

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 24: రాబోయే రబీ మార్కెటింగ్ సీజన్ 2025--26 కు సంబంధించిన ప్యాడి కొనుగోలు (ప్యాడ్డీ ప్రొక్యూర్ మెంట్), ఓపిఎమ్ఎస్ ఎంట్రీల పై జిల్లా స్థాయి అవగాహన , శిక్షణ కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశం లో అదనపు కలెక్టర్ విక్టర్ రెవెన్యూ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ , ఐకేపి వంటి కొనుగోలు సంస్థలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 01 ఏప్రిల్ 2026 నుండి ప్యాడి కొనుగోలు కేంద్రాలు పిపిసి లు) ప్రారంభం కావడానికి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్ని సంస్థలకు స్పష్టమైన సూచనలు జారీ చేయబడినవి. ప్రతి పిపిసి లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించుట పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకాలు, మాయిశ్చర్ మీటర్లు, ప్యాడి క్లీనర్లు , ఇతర అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.అలాగే ఓపిఎమ్ఎస్ , ప్రొక్యూర్ మెంట్ యాప్ లో రైతుల వివరాలు సరిగా, తక్షణం నమోదు చేయడం, రికార్డులను సక్రమంగా నిర్వహించడం, నాణ్యత ప్రమాణాలు , తేమ శాతం (ఎశీఅర్బతీవ అశీతీఎం) పాటించడం, ప్రభుత్వ కొనుగోలు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం పై విస్తృతంగా అవగాహన కల్పించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా, సమయపాలన తో కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు.

ఈ శిక్షణ కార్యక్రమం రెండు సెషన్లలో ఉదయం సెషన్ (10:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు): కామారెడ్డి ,ఎల్లారెడ్డి నియోజకవర్గాలుసెషన్ మధ్యాహ్నం (2:00 నుండి సాయంత్రం 5:00 వరకు): బాన్సువాడ , జుక్కల్ నియోజకవర్గాల వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు.

# రణవీర్ సింగ్ విశ్వరూపం.. రికార్డులను తుడిచిపెడుతున్న 'ధురంధర్'

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర ఆవిష్కృతమవుతోంది. యువ నటుడు రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, రంజాన్ సెలవులను అందిపుచ్చుకుని కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్ల గ్రాస్ మార్కును అధిగమించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో థియేటర్లు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా రణవీర్ సింగ్ నటన, ఆదిత్య ధర్ మేకింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం కూడా సినిమా స్థాయిని పెంచింది. ఈ చిత్రం సృష్టిస్తున్న ప్రభంజనం ముందు పాత




రికార్డులు కొట్టుకుపోతున్నాయి. 'గదర్ 2', 'జైలర్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లను 'ధురంధర్' కేవలం నాలుగు రోజుల్లోనే దాటేయడం విశేషం. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 114 కోట్లు వసూలు చేయడం దీని జోరుకు నిదర్శనం. తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం ఈ చిత్రం సోమవారం కూడా బాక్సాఫీస్ వద్ద తన పట్టు నిలుపుకుంది. సాక్‌నిల్క్ (Sacnilk) రిపోర్ట్ ప్రకారం పనిదినాల్లోనూ మంచి ఆక్యుపెన్సీతో నడుస్తుండటంతో, బుధవారానికల్లా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రణవీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ఇదే ఊపు కొనసాగితే, భారతీయ సినిమా చరిత్రలో టాప్ 5 చిత్రాల సరసన నిలవడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ..


## ఏపీలో ఫిల్మ్ సిటీ, షూటింగ్‌లపై కీలక చర్చలు



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా ఒక ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. బాలీవుడ్ దిగ్గజ నటుడు సంజయ్ దత్, తన బృందంతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలోని సీఎం ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశం జరిగింది. సంజయ్ దత్‌తో పాటు గౌరవ్ దూబే, కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వంటి ప్రముఖులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, సంజయ్ దత్ కాసేపు ఏకాంతంగా కూడా మాట్లాడుకున్నారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ సిటీ నిర్మాణానికి ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. విశాఖపట్నం లాంటి నగరాల్లో బాలీవుడ్ సినిమాల షూటింగ్‌లకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, సింగిల్ విండో క్లియరెన్స్ విధానంపై సీఎం క్లారిటీ ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలను సంజయ్ దత్ బృందం ఆసక్తిగా అడిగి తెలుసుకుంది. కేవలం నటుడిగానే కాకుండా, చిత్ర నిర్మాణ రంగంలో కూడా అనుభవం ఉన్న సంజయ్ దత్ బృందాన్ని ఏపీలో స్టూడియోలు లేదా పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించినట్లు సమాచారం.

ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

## ఏప్రిల్ నుంచి మెగా 158 షూటింగ్!




మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మరోసారి పునరావృతం కానుంది. మెగాస్టార్ కెరీర్‌లో 158వ చిత్రంగా రానున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా సినిమాకు సంబంధించిన అధికారిక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి షెడ్యూల్‌లో చిరంజీవిపై కొన్ని సోలో ఎంట్రీ సన్నివేశాలను, ఆ వెంటనే ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో విజయాన్ని అందుకున్న చిరంజీవిని ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించనున్నట్టు తెలుస్తోంది. అయితే కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తూ బాబీ ఓ ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవిని సరికొత్తగా ప్రజెంట్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయం సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, ఇండస్ట్రీలోనూ అంచనాలు రెట్టింపయ్యాయి. మాస్, ఎమోషన్ కలగలిపి రానున్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందేమో చూడాలి.

విశాఖలో నటి శ్రుతి హాసన్ సందడి..

## ఆమెను చూసేందుకు ఎగబడ్డ ఫ్యాన్స్



విశాఖపట్నంలో నటి శ్రుతి హాసన్ సందడి చేశారు. ఓ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ఆమె ప్రారంభించారు. ఇక, తమ అభిమాన నటి షోరూం ప్రారంభోత్సవానికి రావడంతో ఆమెను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. షోరూం ప్రారంభోత్సవం అనంతరం శ్రుతి హాసన్ అభిమానులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో శ్రుతి హాసన్‌తో పాటు ఎమ్మెల్యేలు సి.హెచ్. వంశీ కృష్ణ, వి. రామకృష్ణ బాబు కూడా పాల్గొన్నారు.

# సినిమా

## డార్లింగ్ రీ రిలీజ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సూపర్ హిట్ చిత్రం డార్లింగ్. ప్రస్తుతం ఈ చిత్రం మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకప్పుడు ఆయనకు డార్లింగ్ అనే ట్యాగ్ తెచ్చిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ఇప్పుడు రీరిలీజ్ రూపంలో తిరిగి థియేటర్లలో సందడి చేయబోతోంది. ఈ సినిమా ఏప్రిల్ 23న గ్రాండ్‌గా మళ్లీ విడుదల కానుంది. 2010లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా ప్రభాస్ నటన, స్టైలిష్ లుక్, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సినిమా తర్వాతే ఆయనకు డార్లింగ్ అనే పేరుతో అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది.

## గ్లామర్ టచ్

ఒకప్పుడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా వెలిగిన అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్.. షార్ట్‌టైంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. గ్లామర్ లుక్స్ తోపాటు.. నటనతో ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. అందం, అభినయంతో తెలుగు, తమిళ్, హిందీ అంటూ భాషతో సం బం ధం లేకుండా పాన్ ఇండియా హీరోయిన్‌గా పేరు దక్కించుకుంది. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే ప్రముఖ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీని పెండ్లి చేసుకుని బాలీవుడ్ లోనే సెటిల్ అయిపోయింది. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరొకవైపు సోషల్‌మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటోంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా మరోసారి అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. జీబ్రా అవుట్ ఫిట్ లో మెస్మరైజ్ చేసింది. వైట్ అండ్ బ్లాక్ చెక్స్ డ్రెస్‌తో గ్లామర్ టచ్ ఇచ్చింది. రకుల్ షేర్ చేసిన ఈ పిక్స్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఇటీవలే హిందీలో 'దేదే ప్యార్‌దే 2'తో అలరించిన రకుల్.. లేటెస్టుగా 'మేరీ పత్నీ కా రీమేక్' ప్రాజెక్టులో బిజీగా ఉంది.



## సో స్పెషల్



'ది రాజా సాబ్' మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో గ్లామర్ షోతో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం సర్దార్ 2 షూటింగులో బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే మాళవిక మోహన్ తరచుగా గ్లామరస్ ఫొటోస్ షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తూ ఉంటుంది. తాజాగా ఓ ఈవెంట్ లో ర్యాంప్‌వాక్‌తో అదరగొట్టింది. ఈసందర్భంగా మాళవిక ఇన్‌స్టా వేదికగా పిక్స్ లను ప్రేక్షకులతో పంచుకుంటూ ఇంట్రెస్టింగ్ పోస్ట్ చేసింది. 'నాకు ర్యాంప్‌వాక్ అంటే చాలా ఇష్టం. ఈ అద్భుతమైన లుక్‌ను రూపొందించిన నా టీమ్‌కు థాంక్స్. నటులుగా మనం క్యారెక్టర్‌లోకి ఒదిగిపోవడం, వేరేలా రెడీ కావడం అలవాటు. కానీ డైరెక్టుగా ఆడియన్స్ ముందుకు వెళ్లే ఆ అనుభూతి మాత్రం సో స్పెషల్. ముఖ్యంగా ఎంతో సరదాగా ఉంటుంది' అంటూ పేర్కొంది.

# తెలంగాణ రాష్ట్రంలో ఒకే రెడ్డి సంఘంగా ఏర్పడిన రాష్ట్ర రెడ్డి సంఘాలు







ఎల్బీనగర్, మార్చి 24 (భారత శక్తి): హైదరాబాద్ నాగోల్ ప్రాంతంలో పిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రాష్ట్ర రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో బద్దూరి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన నూతన హడ్ హాక్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రెడ్ల భవిష్యత్తు, భద్రత, ఆర్థిక, రాజకీయ, అసమానతలు ఎదురవుతున్న ఇబ్బందుల దృశ్యా మంగళవారం అన్నీ సంఘాలు కూడా ఏక వాక్య తీర్మానంతో ఒకే సంఘాన్ని రాష్ట్రంలో ఒకటే రెడ్డి సంఘం ఉండాలనే నినాదంతో అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి ఈ యొక్క సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పేద రెడ్లకు, పేద రెడ్డి విద్యార్థులకు మేమున్నామని ఈ కమిటీ ద్వారా ప్రతి ఒక్కరికి కూడా భవిష్యత్తు కోసం వారికి భరోసా ఇవ్వడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలక వర్గంతో పాటు బడ్జెట్ కూడా కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఆయా సామాజిక వర్గ ప్రజలకి రాష్ట్ర స్థాయిలో ఏదైతే ప్రభుత్వాలు వారికి హైదరాబాద్ నడిబొడ్డున కుల భవనాలు నిర్మించి ఇచ్చిందో అదే విధంగా తెలంగాణ రాష్ట్ర రెడ్ల కోసం పది ఎకరాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది.రానున్న రోజుల్లో రెడ్ల సంక్షేమం కోసం ప్రభుత్వానికి, పేద రెడ్లకు మధ్యలో వారధిగా ఉండి పేద రెడ్ల సంక్షేమానికి ముందు ఉంటామని కొత్తగా ఏర్పడిన కార్యవర్గం ఈ సందర్భంగా శపథం చేశారు. రాష్ట్ర అడ్ హాక్ కమిటీ చైర్మన్ గా బద్దూరి వెంకటేశ్వర రెడ్డి కన్వీనర్ బుట్టెంగారి మాధవరెడ్డి, కో కన్వీనర్లుగా నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, కొట్టం మధుసూదన్ రెడ్డి, వసంత రెడ్డి, నూకల పద్మ రెడ్డి, గంగుల శ్రీలత రెడ్డి, నందికొండ గీతారెడ్డి సభ్యులుగా ఎన్నేపల్లి లింగారెడ్డి, ఎలిమినేటి సుమన్ రెడ్డి, సలహాదారులుగా ఏనుగు సంతోష్ రెడ్డి, పిట్టా శ్రీనివాస్ రెడ్డి, గోపు జైపాల్ రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, నావల్గా సత్యనారాయణ రెడ్డి, బొక్క భూపాల్ రెడ్డి, బొబ్బిలి దామోదర్ రెడ్డి నియమించబడ్డారు.



## మృతి చెందిన కుటుంబానికి
# వంగ రాజేశ్వర్ రెడ్డి ఆర్థిక సహాయం

సిద్దిపేట, మార్చి 24 (భారత శక్తి) : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామానికి చెందిన సంగు ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ సంగు పురేందర్ వంగ రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన మృతుని కుటుంబానికి ఐదువేల రూపాయలను నర్సింలు గౌడ్, బెదురు మల్లేశం, పెద్ది రాజు, శివరామ్, బాలకిషన్, సిద్ధులింగం, మహేందర్ తదితరులు కలిసి మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మానవత్వంతో ఆర్థిక సహాయం చేసిన వంగ రాజేశ్వర్ రెడ్డిని ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు.ఇలాంటి సేవలు భవిషత్ లో కొనసాగాలని ఆకాంక్షించారు.

# నాచారం చెరువుకు మోక్షం!



- **గుర్రపుడెక్క తొలగించి, పూడిక తీయాలని హైడ్రా ఆదేశం.**
- **మీర్జాల్‌గూడలో ముంపు తిప్పలపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన**

హైదరాబాద్, మార్చు 24 (భారతశక్తి): నగరం చుట్టూ ఉన్న చెరువులకు పూర్వవైభవం తెచ్చేందుకు హైడ్రా నడుం బిగించింది. రెండో విడతలో భాగంగా చేపట్టిన 14 చెరువుల పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వేగవంతం చేశారు. మంగళవారం ఉప్పల్ మండలంలోని నాచారం 'పెద్ద చెరువు'ను ఆయన స్వయంగా పరిశీలించారు. 108 ఎకరాల విస్తీర్ణమున్న ఈ చెరువులో ఏకంగా 81 ఎకరాల మేర గుర్రపుడెక్క పేరుకుపోయి, అసలు నీటి జాడ కూడా కనిపించకుండా పోవడాన్ని గుర్తించారు.

**దోమల బెడద.. మురుగు నీటి గోస**

చెరువు పరిస్థితిపై స్థానికులు కమిషనర్‌కు మొరపెట్టుకున్నారు. "మురుగు నీరు నేరుగా చెరువులో కలవడంతో గుర్రపుడెక్క పెరిగిపోయి దోమలతో చస్తున్నాం.. గతంలో పెట్టిన ఎస్టీపీ (STP) వల్ల పైసా ఉపయోగం లేదు" అని ఫిర్యాదు చేశారు. అంబర్‌పేట బతుకమ్మ కుంట, కూకట్‌పల్లి నల్లచెరువు తరహాలో తమ చెరువును కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. స్పందించిన కమిషనర్.. వెంటనే చెరువులోని మురుగు నీటిని వదిలేసి, పూడికను పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ నల్లచెరువు పనులకు ఆటంకం కలగకుండా కాలువను డైవర్ట్ చేయాలని సూచించారు.

- **నాలాలు కుంచించుకుపోయి.. కాలనీలు మునుగుతున్నాయి! మీర్జాల్‌గూడలో వరద ముప్పుపై హైడ్రా అధ్యయనం**

మల్కాజిగిరి పరిధిలోని మీర్జాల్‌గూడ, చిన్మయి మార్గ్ ప్రాంతాల్లో ఏటా వర్షాకాలంలో తలెత్తుతున్న వరద సమస్యపై హైడ్రా ఫోకస్ పెట్టింది. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి రంగనాథ్ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు.

**క్షేత్రస్థాయిలో తేలిన చేదు నిజాలు:**

- కుంచించుకుపోయిన నాలాలు: మహేంద్ర హిల్స్ నుంచి భారీగా వచ్చే వరద నీరు వెళ్లేందుకు కేవలం ఒక మీటరు వెడల్పున్న నాలా మాత్రమే ఉండటంతో కాలనీలు జలమయమవుతున్నాయి.
- ఆక్రమణల సెగ: వరద నీరు సాఫీగా వెళ్లే దారి లేక నీరంతా ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.
- పరిష్కార మార్గాలు: ఉన్న అండర్ డ్రైనేజీ కాలువను వెడల్పు చేయాలా? లేక సమాంతరంగా కొత్త కాలువ నిర్మించాలా? అనే అంశంపై కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాలువ విస్తరణకు స్థానికులు సహకరించాలని కోరారు.




## కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతిని జయప్రదం చేయండి

**: సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు**

సూర్యాపేట (భారతశక్తి జిల్లా ప్రతినిధి) మార్చి 24: స్వతంత్ర సమరయోధులు తెలంగాణ సాయుధ పోరాటయోధులు మాజీ ఎంపీ కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం గారి 15వ వర్ధంతిని జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవనంలో రేగటి లింగయ్య అధ్యక్షతన జరిగిన పట్టణ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ నిజాం రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చూరికైనా పాత్ర పోషించారు అని అన్నారు. ఈ పోరాట సమయంలోనే ఆయనను అరెస్టు చేసి 5 సంవత్సరాలు పైగా జైల్లో ఉంచారు నల్లగొండ, చెంచల్ గూడ, ఔరంగాబాద్ వంటి జైల్లో ఆయన శిక్ష అనుభవించారని అన్నారు. ఆయన జైల్లో ఉన్నప్పుడే ఖైదీల హక్కుల కోసం సమ్మెలు నిర్వహించి వాటికి నాయకత్వం వహించారు అని అన్నారు. ధర్మ బిక్షం గారు శాసనసభ్యునిగా వరుసగా 1952,1957,1962 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీగా ఎన్నికయ్యారు. పార్లమెంటు సభ్యునిగా రెండు పర్యాయాలు నల్లగొండ నుండి ఎన్నికై చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఆయన జీవితం అంతా అణగారిన వర్గాల కోసం కార్మికుల సంక్షేమం కోసం అంకితం చేశారని తెలిపారు ధర్మ బిక్షం గారు 2011లో మార్చి 26న చనిపోయి నేటికీ 15 సంవత్సరాలు అవుతుందని ఆయన వర్ధంతిని సూర్యాపేటల జిల్లా కేంద్రంలో ధర్మ బిక్షం చౌక్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆయన విగ్రహం దగ్గర ఉదయం 10 గంటలకు ఘనంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, పెండ్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్జీవోస్ కాలనీ లైబ్రరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- **బీజేపీ కార్పొరేటర్ల వల్లే పనులు ఆగాయి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**
- **అధికారులకు స్పాట్‌లోనే ఆదేశాలు.. కాలనీవాసుల హర్షం.**



వనస్థలిపురం, మార్చి 24 (భారత శక్తి): ఎన్జీవోస్ కాలనీలో ఎన్నాళ్ల నుంచో పెండింగ్‌లో ఉన్న లైబ్రరీ నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బుధవారం నుంచే పనులు పునఃప్రారంభం కానున్నాయి. మంగళవారం కాలనీ గ్రౌండ్‌లో కాలనీ పెద్దలు, స్థానికులతో నిర్వహించిన సమావేశానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లైబ్రరీ పనులు వెంటనే పూర్తి చేయాలని కాలనీవాసులు ఆయనను కోరారు.

**రాజకీయాల వల్లే జాప్యం..**

సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లైబ్రరీ పనులను తాను ఎప్పుడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. కేవలం కొందరు బీజేపీ కార్పొరేటర్లు చేసిన రాద్ధాంతం, వారి దుందుడుకు చర్యల వల్లే పనులు నిలిచిపోయాయని ఆయన ఆరోపించారు. రాజకీయ కారణాలతో కాలనీ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు.

**అధికారులకు ఎమ్మెల్యే ఆర్డర్..**

పనుల జాప్యంపై స్పందించిన ఎమ్మెల్యే.. అక్కడే ఉన్న గ్రంథాలయ ఈఈ, డీఈలతో మాట్లాడారు. రేపటి నుంచే (బుధవారం) పనులు మొదలుపెట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపకూడదని స్పాట్‌లోనే ఆదేశాలిచ్చారు. పనులు మళ్లీ స్టార్ట్ అవుతుండటంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని, పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డిని కాలనీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు కాలనీ పెద్దలు సోమయాజులు, పంపన్న వెంకటేశ్వర, శివనాగేశ్వర్ రావు, జైపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, ఓంప్రకాష్, భూషణ్, విశ్వనాథం, శ్యాంకుమార్, ఆనంద్ తో పాటు అనిల్ చౌదరీ, రాఘవేందర్ రావు, కొంగర మహేష్, రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి ఒకటికి.. నిర్మాణం మరొకటికి!

- **మలక్పేట్లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనం**
- **అధికారుల కళ్లుగప్పి అక్రమ నిర్మాణం.. అక్రమ నిర్మాణం కూల్చకుంటే ఆత్మహత్యే శరణ్యం బాధితుడి డిమాండ్.**

హైదరాబాద్, మార్చి 24(భారత శక్తి): నగరంలో అక్రమ కట్టడాల పర్వం కొనసాగుతూనే ఉంది. అనుమతులు ఒక రకంగా తీసుకుని, క్షేత్రస్థాయిలో మరో రకంగా నిర్మాణాలు చేపడుతున్న ఘటన తాజాగా మలక్పేట్ పరిధిలోని అక్బర్బాగ్లో వెలుగుచూసింది. అధికార యంత్రాంగం నోటీసులు ఇచ్చినా, భవనాన్ని సీజ్ చేసినా లెక్కచేయకుండా నిర్మాణాలు సాగిస్తుండటం గమనార్హం.

- **వివరాల్లోకి వెళ్తే..**

మలక్పేట్ సర్కిల్ 27 పరిధిలోని అక్బర్బాగ్లో ఉన్న ఓ ఓపెన్ ప్లాట్ (H.No.162716/D) విషయంలో వివాదం నెలకొంది. సదరు స్థలంలో భవన యజమానులు కేవలం స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తుల (G+2) నివాస కట్టడానికే జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పొందారు. అయితే, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలను తుంగలో తొక్కి ఏకంగా ఐదు అంతస్తుల (G+4) భారీ భవనాన్ని నిర్మిస్తున్నారు. సెట్బ్యాక్ల విషయంలోనూ నిబంధనలు పాటించకుండా గాలికి వదిలేశారు.

- **నకిలీ పత్రాలతోనే అనుమతి?**

ఈ అక్రమ నిర్మాణంపై పక్కనే నివసించే మహమ్మద్ అబ్దుల్ ఖుద్దూస్ అనే వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తులు నకిలీ పత్రాలు, తప్పుడు డోర్ నంబర్లను చూపి అనుమతి పొందినట్లు ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. దీనిపై గతేడాది జూన్ నుంచి పోరాడుతున్నా, అధికారులు కేవలం నోటీసులకే పరిమితమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతికి మించి అదనపు అంతస్తులు నిర్మించినట్లు నిర్ధారించి షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు.

- **చర్యలు తీసుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం..**

అధికారులు ఎన్ని నోటీసులు ఇచ్చినా నిర్మాణదారులు పనులు ఆపడం లేదని బాధితుడు ఖుద్దూస్ ఆరోపిస్తున్నారు. ఇప్పటికే తీవ్ర అనారోగ్యంతో గుండె శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన స్థితిలో ఉన్నానని, అధికారుల నిర్లక్ష్యం తనను మరింత కుంగదీస్తోందని ఆయన వాపోయారు. తక్షణమే ఈ అక్రమ కట్టడాన్ని కూల్చివేసి తనకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్యే శరణ్యమని ఆయన ఉన్నతాధికారులకు పంపిన లేఖలో పేర్కొన్నారు.

- **హెచ్చరించిన అధికారులు..**





ఈ వ్యవహారంపై స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులను 15 రోజుల్లోగా స్వచ్ఛందంగా తొలగించాలని యజమానులను ఆదేశించారు. లేనిపక్షంలో నగరపాలక సంస్థే స్వయంగా కూల్చివేత చేపట్టి, ఆ ఖర్చును కూడా యజమానుల నుంచే వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

- పర్సంటేజీల కక్కుర్తితో నష్ట నివారణ వర్కులు.!
- ప్రజాధనం దుర్వినియోగం.!
- మండి పడుతున్న ప్రజలు
- కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు అధికారుల ప్రణాళికలు
- రోడ్డు వేసి పది రోజులు కూడా కాలే.!
- పైపు లైన్ మరమ్మతుల కోసం రోడ్డు తవ్వేశారు.!

# అస్తవ్యస్త ప్రణాళికలు.!

మణుగూరు, మార్చి 24 (భారతశక్తి): పట్టణ ప్రణాళికలు, అధికారుల అస్తవ్యస్త ప్లానింగ్ తో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ పట్టణ ఆర్థిక మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ నుండి రూ.490 లక్షల నిధులతో పూల మార్కెట్ సెంటర్ లోని శివలింగాపురం వెళ్ళే వైపు లక్ష్మణ్ కిరాణా షాపు నుండి మున్సిపాలిటీ కార్యాలయం మీదుగా నాయుడు కుంట చెరువు వరకు సిసి రోడ్డు నిర్మాణం చేశారు. పట్టుమని పది రోజులు కాకుండానే వాటర్ పైపు లైన్ కోసం

సిసి రోడ్డును పగులగొట్టి తవ్వేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు పట్టణంలోని






ఇంజనీరింగ్ అధికారుల తీరుకు నిలువెత్తు నిదర్శనం.

*** మూణ్నాళ్ల ముచ్చటగానే నిర్మాణాలు***

అభివృద్ధి పనులను రూ.4 కోట్ల 90 లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన సిసి రోడ్డు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఈ రహదారి వెంబడి కల్వర్టు నిర్మాణం చేసేటప్పుడు కాంక్రీటులో నాణ్యత లోపించి రెండు సార్లు కుప్ప కూలడం జరిగింది. నిర్మాణం చేసిన వారం రోజులకే కల్వర్టును పగులగొట్టి వాటర్ పైపు లైన్ మరమ్మతులు చేశారు. పగులగొట్టిన ప్రాంతంలో మసి పూసి మారేడు కాయను చేసిన చందంగా కాంక్రీటు వేశారు. ఆ ప్రాంతంలో కాంక్రీటు రాళ్లు పైకి తేలి అస్తవ్యస్తంగా మారింది. రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో వాహనదారులు అటువైపు వెళ్లకుండా ఒక వైపు మాత్రమే ప్రయాణాలు సాగిస్తున్నారు. అయిన సంబంధించిన అధికారులు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోకుండా కళ్ళున్న కబోధిలా వ్యవహరించారని పట్టణ వాసులు, వాహనదారులు విమర్శలు గుప్పించారు.

*** నష్ట నివారణ పనులు***

శివలింగాపురం వైపు లక్ష్మణ్ కిరాణా షాపు నుండి మున్సిపాలిటీ కార్యాలయం మీదుగా నాయుడు కుంట చెరువు వరకు నిర్మించిన సిసి రోడ్డు పనులు చూస్తే ప్రతి ఒక్కరూ ముక్కునవేలు వేసుకోవాల్సిందే. ప్రజా ఆరోగ్య శాఖ ఇంజనీర్లు పట్టణ ప్రజలకు అందించే త్రాగునీరు వాటర్ పైపు లైన్లు తయారు చేసిన ప్రణాళికలు చూస్తే ప్రతి ఒక్కరినీ పరేషాన్ చేస్తుంది. పైపు లైన్ వేసి ట్రయిల్ రన్ చేయకుండానే సిసి రోడ్లు నిర్మాణం చేశారు. సిసి రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత వాటర్ పైపు లైన్ ట్రయిల్ రన్ చేశారు. ట్రయిల్ రన్ లో లోపాలు లోపించడంతో వేసిన సిసి రోడ్లు పగులగొడుతున్నారు. రోడ్లు వేసుడు.. పగులగొట్టుడు ఇదే పనిగా కాంట్రాక్టర్లు, అధికారులు చేస్తున్నారు. అధికారులు ముందస్తు ప్రణాళికలు లేకుండా ప్రజా ధనం వృధా చేసి కాంట్రాక్టర్లు, సంబంధించిన అధికారుల




జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంట్రాక్టర్ అధికార పార్టీకి చెందిన మంత్రి బంధు మిత్రులు కావడంతో ప్రశ్నించే వారు కరువయ్యారు. ప్రజాధనాన్ని దుర్వినియోగానికి పాల్పడుతున్న ఇంజనీర్లపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజానీకం ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.



# భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

- **టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**
- **రామ మందిర్ లో ఏర్పాట్లు పరిశీలన**

సంగారెడ్డి, మార్చ్ 24(భారత శక్తి ప్రతినిధి): సంగారెడ్డి పట్టణంలోని రాంనగర్ రామ్ మందిర్ లో శ్రీరామనవమి వేడుకల ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీతారాముల కళ్యాణం దర్శనానికి వేచి ఉండే భక్తులకు త్వరగా దర్శనమయ్యేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండ తగలకుండా సీలింగ్ టెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దర్శనంలో పాల్గొన్న భక్తులకు ముత్యాల తలంబ్రాలు అందిస్తామన్నారు. మందిరానికి వచ్చే భక్తులకే తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. లైన్లో వేచి ఉండే భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని దర్శనం ఆలస్యం కాకుండా ఏర్పాట్లు చకచకా చేస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు 'ఉగాది పురస్కారాలు – 2026

- **40 విభాగాలకు దరఖాస్తుల ఆహ్వానం**
- **రెండు తెలుగు రాష్ట్రాల జర్నలిస్టులకు అవకాశం**
- **మహిళా జర్నలిస్టులకు ప్రత్యేకంగా 5 పురస్కారాలు**
- **దరఖాస్తుకు చివరి తేదీ 05, ఏప్రిల్ 2026**
- **టీజేఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు- మేడవరపు రంగనాయకులు**









సూర్యాపేట, మార్చి 24(భారత శక్తి జిల్లా ప్రతినిధి) : ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూ అక్షరాయుధాలతో సమాజాన్ని చైతన్యపరుస్తున్న జర్నలిస్టులను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు పేర్కొన్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు కార్యక్రమంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులైన తెలుగు జర్నలిస్టులకు పురస్కారాలు అందజేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కేవలం నిరసనలు, పోరాటాలకే పరిమితం కాకుండా, వృత్తిపరంగా జర్నలిస్టులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2023లో ఈ పురస్కారాల ప్రక్రియను ప్రారంభించామన్నారు. గత మూడేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ నగరాల్లో అత్యద్భుతంగా కార్యక్రమాలను నిర్వహించామని, ఈ ఏడాది (2026) కూడా ఈ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించబోతున్నామని వివరించారు. గతంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సుప్రీంకోర్టు పూర్వపు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ వంటి మహనీయుల చేతుల మీదుగా ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు పురస్కారాలు అందజేశామని, ఈ ఏడాది కూడా అంతే స్థాయిలో గొప్పగా నిర్వహించేందుకు ప్రయతిస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 40 విభాగాలకు గాను 50 మంది జర్నలిస్టులకు ఉత్తమ జర్నలిస్టు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. అందులో మహిళా జర్నలిస్టులకు ప్రత్యేకంగా 5 పురస్కారాలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు రాజకీయంగా, పాలనాపరంగా విడిపోయినా జర్నలిస్టులు మాత్రం విడిపోలేదు అని, అందుకే మేమంతా తెలుగు జర్నలిస్టులం అని గర్వంగా చెబుతున్నామన్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం జర్నలిస్టుల ఐక్యతకు సంక్షేమానికి కృషి చేస్తుందని, ఇటువంటి కార్యక్రమాలు ప్రతియేటా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభ కలిగిన జర్నలిస్టులను గుర్తించి, సమాజానికి మెరుగైన జర్నలిజాన్ని అందించడమే తమ సంఘం లక్ష్యమన్నారు. వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావం కలిగిన జర్నలిస్టులకు ఈ పురస్కారాలు మరింత ఉత్తేజాన్నిస్తాయని రంగనాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాస్, బోడపాటి సుబ్బారావు, హనుమంతాచారి, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గజ్జల శ్రీనివాస్, మేనం శ్యామ్, గడ్డం సత్యనారాయణ, తదితరులు ఈ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి కన్వీనర్ లుగా వ్యవహరిస్తున్నారు. మీడియా కోఆర్డినేటర్, తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు 7036602022, 9866001612 లలో సంప్రదించాలని కోరారు.




## సూర్యాపేట జిల్లాను
# క్షయ రహిత జిల్లాగా చేయాలి

**: జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్**

సూర్యాపేట, మార్చి 24 (భారత శక్తి జిల్లా ప్రతినిధి): క్షయ (టీబీ)ను జిల్లా నుంచి పూర్తిగా నిర్మూలించి టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో క్షయ వ్యాధి నిర్మూలనపై గాంధీ పార్క్ నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జెండా ఊపి ప్రారంభించారు.. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ, సామాజిక వ్యాప్తి జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి నిర్ధారణ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్నీ పరికరాలు, పూర్తి స్థాయి చికిత్స తగిన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రూ.20 లక్షల వ్యయంతో మొబైల్ ఎక్స్ రే మిషన్ కొనుగోలు చేసి వాటి ద్వారా జనవరి 2025నుండి జిల్లా వ్యాప్తంగా 52, 901 మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగిందని వీరిలో 1741 మందికి రోగ నిర్ధారణ కాగా 1356 మందికి చికిత్స పూర్తి అయిందని ప్రస్తుతం 385మందికి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. 21గ్రామ పంచాయితీలను టీబీ ముక్తి గ్రామ పంచాయితీలుగా గుర్తించడం జరిగిందని జిల్లాలో కొత్త కేసులు నమోదవకుండా 21 నుండి 100టిబి ముక్తి జిపిలుగా, టిబి ముక్తి మండలాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు టిబి వారియర్ లుగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో అవగాహన, అనుమానితులకు పరీక్షలు నిర్వహించి లక్ష్య సాధన చేరిన పిహెచ్సీలకు రూ.లక్ష ప్రోత్సాహకాన్ని, జిల్లాలోని మూడు టీబీ యూనిట్ల అభివృద్ధి కొరకై రూ.3లక్షల చొప్పున కలెక్టర్ ప్రకటించారు. అనంతరం టిబి ముక్తి జీపీలుగా తీర్చిదిద్దిన సర్పంచులను, గ్రామ కార్యదర్శులను, వైద్య సిబ్బందిని ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ, ప్రస్తుత ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్, డాక్టర్ నాజియా తబస్సుమ్, హెచ్వోడిలు డాక్టర్ గురు రాజు, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ శ్రీకాంత్ భట్, డాక్టర్ జనార్ధన్, పల్మనాలజిస్ట్ డాక్టర్ వెంకట పాపిరెడ్డి, డిప్యూటీ డియంహెచ్ఓలు డాక్టర్ జి చంద్రశేఖర్, డాక్టర్ మాధవ్ కుమార్, ఆర్డిఓ వేణు మాధవ్, వైద్యాధికారులు, ఇతర వైద్య సిబ్బంది. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈనెల 28న నిర్వహించే
# జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

**: జి.భవాని చంద్ర**

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కం చైర్మన్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సంగారెడ్డి**




సంగారెడ్డి జిల్లా, మార్చి 24 (భారత శక్తి) : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ,రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో సంగారెడ్డి కోర్ట్ నందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.భవాని చంద్ర, న్యాయవాదులతో ఈ నేల 28 వ తేదిన నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భం గా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు న్యాయమూర్తి మాట్లాడుతు, రాజీ చేయదగ్గ పోలీస్ కేసులు,భార్యాభర్తల చిన్నచిన్న వివాదాలు,ఎక్సైజ్ కేసులు, బ్యాంక్ కేసులు తదితర కేసులు రాజీ చేయదగ్గ కేసులలో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చు అన్నారు. క్షణికావేశంలో ఇరువర్గాలు చిన్న చిన్న తగాదాలు పడి కేసులు నమోదు జరిగి కోర్టు చుట్టూ తిరుగుతూ తమ తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా కోర్టులో తమ తమ పై ఉన్నటువంటి కేసులను రాజీచేసుకుని సామరస్యంగా స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలి అన్నారు. న్యాయవాదులు అందరు సహకారం అందించి ఈ లోక్ అదాలత్ నీ విజయవంతం చేయాలనీ, కక్షి దారులకు పెద్ద మొత్తం లో నష్టపరిహారం వచ్చేలా కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర తో పాటు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జీ కార్యదర్శి డి.వి.ఆర్.తేజో కార్తీక్,బార్ జనరల్ సెక్రటరీ వి.మహేశ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# సంతోష్ నగర్ ఫ్లై ఓవర్ పనులను జూన్ లోగా పూర్తి చేయాలి

**: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్**

హైదరాబాద్, 24 మార్చి (భారత శక్తి) : చంచల్‌గూడ సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను జూన్ లోగా పూర్తి చేయాలనీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నిర్మాణంలో ఉన్న సంతోష్ నగర్ ఫ్లై ఓవర్ పనులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ





చేశారు. పనులను మరింత స్పీడ్ అప్ చేయాలని అధికారులకు సూచించారు. ఫ్లై ఓవర్ పనుల పూర్తికి జూన్ ను డెడ్ లైన్ గా పెట్టుకోవాలన్నారు. తనిఖీలో కమిషనర్ వెంట చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

# పశ్చిమాసియా పరిస్థితులు... రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటన

ఢిల్లీ, 24 మార్చి (భారత శక్తి) : పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా తీసుకున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆయా దేశాల్లో చిక్కుకున్న మనవారిని సురక్షితంగా తీసుకువచ్చామని తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులపై ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ, పశ్చిమాసియా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. అక్కడ యుద్ధం జరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక సమస్యలు వస్తున్నాయని, ఇంధన సంక్షోభానికి దారితీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో ముడి చమురు, గ్యాస్, ఎరువుల రవాణాకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం మనకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, హర్మూజ్ జలసంధి మీదుగా భారత చమురు నౌకలు వస్తున్నాయని వెల్లడించారు. ఆ నౌకలు సురక్షితంగా మన పోర్టులకు చేరేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అక్కడి నుంచి 3.54 లక్షల మంది భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చామని అన్నారు. ఈ దాడుల్లో కొంతమంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారని సభకు తెలిపారు. గల్ఫ్ దేశాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. సమస్యలకు చర్చలు, సంప్రదింపులే ఏకైక పరిష్కారమని ప్రధాని మోదీ అన్నారు.

## మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు
# పాపారావు లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్, 24 మార్చి (భారత శక్తి) : ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ను నక్సల్ రహితంగా మారుస్తామని ప్రభుత్వం విధించుకున్న గడువుకు వారం రోజుల ముందే ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. బస్తర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న చివరి అగ్రశ్రేణి మావోయిస్టు కమాండర్ పాపారావు అలియాస్ మంగు తన సాయుధ బృందంతో సహా పోలీసులకు లొంగిపోయాడు. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. సుక్మా జిల్లాకు చెందిన 56 ఏళ్ల పాపారావు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో సీనియర్ సభ్యుడు. ఇతను బీజాపూర్ జిల్లాలోని కుట్రు పోలీస్ స్టేషన్‌లో 17 మంది అనుచరులతో (10 మంది పురుషులు, 8 మంది మహిళలు) కలిసి లొంగిపోయాడు. వీరి నుంచి 8 ఏకే47 రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ రైఫిల్‌ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పాపారావు తలపై రూ.25 లక్షల రివార్డు ఉంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత బస్తర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్‌గా పాపారావు ఉన్నాడు. ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ ధృవీకరించారు. పాపారావు లొంగుబాటుతో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఇక క్రియాశీల సభ్యులెవరూ లేరని ఆయన తెలిపారు. లొంగిపోయే ముందు తాను పాపారావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. రాష్ట్రం వెలుపల కేవలం ఇద్దరు అగ్ర నేతలు మిషిర్ బెస్రా, గణపతి మాత్రమే మిగిలి ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. పాపారావు లొంగుబాటుతో బస్తర్‌లో సాయుధ నక్సలిజం పూర్తిగా అంతమైందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ పరిణామంపై రాష్ట్ర కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. గడువు ముగిసిన తర్వాత అమాయక ఆదివాసులపై వేధింపులు పెరిగే ప్రమాదం ఉందని, వారిపై నక్సలైట్లు అనే ముద్ర వేసి అరెస్టులు చేయవచ్చని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్ హెచ్చరించారు. బస్తర్ సహజ వనరులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ప్రమాదం కూడా ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

## ఉప్పల్ స్టేడియానికి కొత్త కళ...
# రూ.10 కోట్లతో అభివృద్ధి చేసిన సన్ గ్రూప్

హైదరాబాద్, 24 మార్చి (భారత శక్తి) : హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సరికొత్త హంగులను సంతరించుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యాజమాన్య సంస్థ అయిన సన్ గ్రూప్, స్టేడియం ఆధునికీకరణ పనులను భారీ ఎత్తున చేపట్టింది. ఈ పనుల కోసం రూ.10 కోట్లకు పైగా వ్యయం చేసినట్టు సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తెలిపింది. ఈ ఆధునికీకరణలో భాగంగా స్టేడియంలోని ప్రేక్షకులు, సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించారు. స్టేడియం వ్యాప్తంగా ఉన్న 46 టాయిలెట్లను, ఒక లాంజ్‌తో సహా 42 బాక్సులను పూర్తిగా పునరుద్ధరించారు. దీంతో పాటు, కొత్తగా రెండు ఎలివేటర్లను (లిఫ్టులు), 43 ఎయిర్ కండిషనర్లను (ఏసీలు) ఏర్పాటు చేశారు. ఈ మార్పులతో స్టేడియం సదుపాయాలు కొత్తరూపు సంతరించుకున్నాయి. స్టేడియంలో చేపట్టిన ఈ అభివృద్ధి పనుల వివరాలను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వెల్లడించింది. రాబోయే క్రికెట్ మ్యాచ్‌లకు హాజరయ్యే అభిమానులకు ఈ కొత్త సౌకర్యాలు మెరుగైన అనుభూతిని అందించనున్నాయి.

# ఇరాన్ భద్రతా మండలి నూతన అధిపతిగా మహ్మద్ జోల్‌ఘదర్

ఇరాన్, 24 మార్చి : ఇరాన్‌కు చెందిన అత్యంత శక్తివంతమైన సుప్రీమ్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (SNSC) కొత్త అధిపతిగా మహమ్మద్ బాగర్ జోల్‌ఘదర్‌ను నియమించారు. ఇటీవల ఆ దేశ భద్రతా చీఫ్ అలీ లారిజానీ ఓ దాడిలో మరణించిన నేపథ్యంలో ఈ నియామకం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. జోల్‌ఘదర్, ఇరాన్ సైన్యంలో కీలకమైన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC)లో బ్రిగేడియర్ జనరల్ హోదాలో పనిచేసిన అనుభవజ్ఞుడు. ఈ నియామకానికి ముందు ఆయన ఇరాన్ ఎక్స్‌పెడియెన్సీ కౌన్సిల్ సెక్రటరీగా, అంతకుముందు హోం మంత్రిత్వ శాఖలో భద్రతా వ్యవహారాల డిప్యూటీ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. సుప్రీమ్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అనేది ఇరాన్ జాతీయ భద్రతా వ్యూహాలను రూపొందించే అత్యున్నత సంస్థ. ఈ పదవిలో జోల్‌ఘదర్ దేశ రక్షణ, అణు కార్యక్రమాలు, విదేశాంగ విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తారు. ఆయన సైనిక మరియు రాజకీయ అనుభవం ఈ నియామకానికి బలం చేకూరుస్తుందని భావిస్తున్నారు. గత వారం జరిగిన ఓ దాడిలో అలీ లారిజానీ ప్రాణాలు కోల్పోవడంతో ఈ పదవి ఖాళీ అయింది. జోల్‌ఘదర్ నియామకంతో ఇరాన్ భద్రతా విధానాల్లో కొత్త అధ్యాయం మొదలవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## హర్మూజ్ జలసంధి, ఖర్గ్ ఐలాండ్ అంశాలపై
# 40 ఏళ్ల క్రితమే ట్రంప్ పత్రికా ప్రకటన

అమెరికా, 24 మార్చి : హర్మూజ్ జలసంధి ప్రాంతంలో తమకు అవసరంలేని చమురు రవాణాకు రక్షణ కల్పిస్తున్నామని, ఇలాంటి జలసంధిని కాపాడుకోవడానికి అందరూ రావాలని యుద్ధానికి తాత్కాలిక విరామం ప్రకటించడానికి ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఇలాంటి మాటలనే దాదాపు 40 ఏళ్ల క్రితం కూడా చెప్పారు. ఇరాన్‌తో యుద్ధం వేళ, నాలుగు శతాబ్దాల క్రితం ట్రంప్ ఇచ్చిన వాణిజ్య ప్రకటన సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. "తనకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చని నౌకలకు గల్ఫ్ ప్రాంతంలో అమెరికా మిలిటరీ రక్షణగా ఉంటోంది. తమకు అవసరంలేని చమురు రవాణాకు సహకారం అందిస్తోంది. ఈ ప్రక్రియ నుంచి లబ్ధి పొందుతున్న దేశాలు మాత్రం ఒక్క డాలర్ కూడా ఇవ్వడంలేదు. కనీసం ఒక్క సైనికుడిని కూడా పంపించలేదు" అంటూ ట్రంప్ 1987లో మూడు పత్రికల్లో 94,801 డాలర్లు చెల్లించి యాడ్ ఇచ్చారు. అమెరికా డబ్బుతో జపాన్ ఇతర దేశాల ప్రయోజనాలు కాపాడుతున్నారని నాటి అమెరికా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆ తర్వాత ఏడాది గార్డియన్ పత్రికతో మాట్లాడుతూ ఖర్గ్ ఐలాండ్ గురించి మాట్లాడారు. ఇరాన్‌లోని అతిపెద్ద చమురు ఎగుమతి టెర్మినల్ ఖర్గ్‌ను స్వాధీనం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఇరాన్ యుద్ధం నేపథ్యంలోనూ ఆయన హర్మూజ్ జలసంధిపై వివిధ దేశాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అలాగే ఖర్గ్‌ను అమెరికా స్వాధీనం చేసుకునే ఆలోచనలో ఉందని వార్తలు వచ్చాయి.

# గ్యాస్ ఆగమాగం.. జనం బజార్లపాలు!




హైదరాబాద్, మార్చి 24 (భారత శక్తి) : రాష్ట్రంలో గ్యాస్ కష్టాలు పతాక స్థాయికి చేరాయి. సామాన్యుడి వంటగది నుంచి సిటీలోని హోటళ్ల వరకు అంతా 'నో స్టాక్' బోర్డులే కనిపిస్తున్నాయి. ఒకవైపు సిలిండర్ రాక జనం అల్లాడుతుంటే, మరోవైపు గ్యాస్ కొరతపై ప్రభుత్వం గాలిలో మాటలు చెబుతోందని విపక్షాలు భగ్గుమన్నాయి. మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీఆర్ఎస్ నేతలు.. రాష్ట్రంలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితిని ఎండగట్టారు.

**వంటగదిలో యుద్ధం.. రోడ్డుపై నిరసన!**

మంగళవారం ఉదయం గన్ పార్క్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఖాళీ సిలిండర్లతో రోడ్డుపై బైఠాయించారు. "గ్యాస్ ఇస్తారా? గద్దె దిగుతారా?" అంటూ నినదించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. "ప్రభుత్వ అసమర్థత వల్లే సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు వెళ్తున్నాయి. హోటళ్లు మూతపడుతున్నాయి, చిరు వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని మండిపడ్డారు. గన్ పార్క్ నుంచి అసెంబ్లీకి ర్యాలీగా వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది.

* లోగుట్టు: సరఫరాలో సవాలక్ష అడ్డంకులు!
* రాష్ట్రంలో గ్యాస్ కొరతకు కేవలం అంతర్జాతీయ కారణాలే కాకుండా, లోకల్ మేనేజ్మెంట్ లోపాలు కూడా ఉన్నాయని మా 'భారత శక్తి' పరిశోధనలో తేలింది:
* బొట్టు బొట్టుగా సరఫరా: పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల దిగుమతులు తగ్గడం వాస్తవమే అయినా, పొరుగు రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటకలో లేని కొరత తెలంగాణలోనే ఎందుకు ఎక్కువగా ఉంది? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.
* వాణిజ్య సిలిండర్ల మాయం: కమర్షియల్ సిలిండర్ల సరఫరాను ఆయిల్ కంపెనీలు దాదాపు 40% తగ్గించాయి. దీంతో చిన్న హోటళ్లు, తోపుడు బండ్ల వ్యాపారులు గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా వాడుతున్నారు.
* బ్లాక్ మార్కెట్ దందా: బుకింగ్ చేసుకున్నా వారం రోజుల వరకు డెలివరీ కావడం లేదు. ఇదే అదనుగా కొన్ని ఏజెన్సీలు ఒక్కో సిలిండర్‌పై రూ. 200 నుంచి రూ. 300 వరకు అదనంగా వసూలు చేస్తున్నాయి.
* **ప్రభుత్వ ప్రకటనలకు.. వాస్తవాలకు పొంతన లేదు!**

పౌరసరఫరాల శాఖ మంత్రి అన్నీ బాగున్నాయని చెబుతున్నా, గ్రౌండ్ లెవల్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.30 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉంటే, సగం మంది రీఫిల్ కోసం వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. "కొరత లేదని చెబుతున్న ప్రభుత్వం, గ్యాస్ ఏజెన్సీల దగ్గర ఎందుకు క్యూ లైన్లు కనిపిస్తున్నాయో సమాధానం చెప్పాలి" అని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

**'స్పష్టత' ఇస్తారా? 'కష్టాలు' తీరుస్తారా?**

యుద్ధం పేరుతో ఆయిల్ కంపెనీలు చేస్తున్న కోతను నిలదీయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణమే నిల్వలను పెంచకపోతే, సామాన్యుడి వంటగదిలో మంట ఆరిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని కేంద్రంతో చర్చలు జరిపి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

## సర్వర్లలో సాంకేతిక లోపం...
# తెలంగాణలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

హైదరాబాద్, 24 మార్చి (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రధాన సర్వర్లలో సాంకేతిక సమస్యల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. స్లాట్ బుకింగ్, చలాన్ల చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయి. స్లాట్ బుక్ చేసుకున్నవారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఈకేవైసీ ప్రక్రియతో పాటు అన్ని కార్యకలాపాలు నిలిచిపోయాయి. భూబదలాయింపు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. స్లాట్లు బుక్ చేసుకున్నవారు, కొనుగోలుదారులు, విక్రేతలు ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ప్రధాన సర్వర్లలో సాంకేతిక లోపం తలెత్తిన నేపథ్యంలో, అధికారులు సాంకేతిక బృందాలను రంగంలోకి దింపారు. సర్వర్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం: సీఎం చంద్రబాబు

అమరావతి, 24 మార్చి (భారత శక్తి) : ఏపీలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నిన్న అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద శంకుస్థాపన జరగడం తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఓ దిక్సూచి అని అభివర్ణించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ సాధ్యమైందంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. "మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్నిచోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది. గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అంటూ సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## రాజమహేంద్రవరం హైదరాబాద్ మధ్య మూడు కొత్త విమాన సర్వీసులు

ఆంధ్రప్రదేశ్, 24 మార్చి (భారత శక్తి) : ఏపీలో విమానయాన సేవలు క్రమంగా విస్తరిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు నగరాల నుంచి డిమాండ్ ఉన్న రూట్లలో కొత్త సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు మరో మూడు కొత్త విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఫ్లై 91 ఎయిర్‌లైన్స్ ఈ సేవలను అందించేందుకు ముందుకొచ్చింది. ఈ నెల 29వ తేదీ నుంచి ఈ మూడు కొత్త సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రతీరోజూ ఉదయం 9:15 గంటలకు, మధ్యాహ్నం 1:05 గంటలకు, రాత్రి 9:05 గంటలకు ఈ విమానాలు రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరుతాయి. ఈ నిర్ణయంతో రాజమండ్రి హైదరాబాద్ మధ్య ప్రయాణం మరింత సులభతరం కానుంది. ప్రస్తుతం రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు 5 సర్వీసులు.. చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాలకు ఒక్కో సర్వీసు నడుస్తున్నాయి. తాజా నిర్ణయంతో హైదరాబాద్‌కు నడిచే విమానాల సంఖ్య పెరగనుంది.

## కాలుష్యంలో పాకిస్థాన్ టాప్.. ప్రపంచంలోనే అత్యంత కలుషిత దేశంగా రికార్డ్

పాకిస్థాన్, 24 మార్చి : వాయు కాలుష్యంలో పాకిస్థాన్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2025 సంవత్సరానికి గానూ ప్రపంచంలోనే అత్యంత కాలుష్యభరిత పొగమంచుతో కూడిన దేశంగా పాకిస్థాన్ నిలిచినట్టు స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యత పర్యవేక్షణ సంస్థ 'ఐక్యూఎయిర్' (IQAir) తన వార్షిక నివేదికలో వెల్లడించింది. ఇక్కడి గాలిలో ప్రమాదకరమైన సూక్ష్మ రేణువుల (PM2.5) సాంద్రత ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశించిన సురక్షిత స్థాయి కంటే 13 రెట్లు అధికంగా ఉన్నట్టు నివేదిక స్పష్టం చేసింది. తాజాగా విడుదలైన ఈ నివేదిక ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా 143 దేశాలు, ప్రాంతాల్లో వాయు నాణ్యతను పర్యవేక్షించగా.. వాటిలో 130 దేశాలు డబ్ల్యూహెచ్ఓ నిర్దేశించిన ప్రమాణాలను అందుకోలేకపోయాయి. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం, గాలిలో PM2.5 రేణువుల సాంద్రత ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రోగ్రాముల కంటే తక్కువగా ఉండాలి. అయితే, పాకిస్థాన్ తర్వాత బంగ్లాదేశ్, తజికిస్థాన్ దేశాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. 2024లో అత్యంత కాలుష్య దేశంగా ఉన్న చాద్, ఈసారి నాలుగో స్థానానికి పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 14 శాతం నగరాలు మాత్రమే 2025లో డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలకు అనుగుణంగా స్వచ్ఛమైన గాలిని కలిగి ఉన్నాయి.

## పశ్చిమాసియాలో ఆగిపోనున్న యుద్ధం.. ఇరాన్ కీలక నిర్ణయం..?

24 మార్చి (భారత శక్తి) : అమెరికా, ఇజ్రాయెల్‌లతో శత్రుత్వం కొనసాగిస్తున్న ఇరాన్ వైఖరిలో అనూహ్య మార్పు చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ప్రత్యక్ష చర్చలకు సిద్ధమని ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఇజ్రాయెల్, అరబ్ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామం ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ, సైనిక శక్తి తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన గుర్తించినట్లు సమాచారం.

# బడంగ్‌పేట్‌లో 'ప్రజా పాలన' పారిశుద్ధ్య పనులు




* **99 రోజుల ప్రణాళికలో భాగంగా ముమ్మరంగా క్లీన్నెస్ డ్రైవ్**
* **డిప్యూటీ కమిషనర్ పి. సరస్వతి నేతృత్వంలో పరిసరాల పరిశుభ్రత**

బడంగ్పేట్, మార్చి 24 (భారతశక్తి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం ఉదయం సర్కిల్ 16 పరిధిలోని పలు వార్డుల్లో బృహత్తర శుభ్రత కార్యక్రమాన్ని (Cleanliness Drive) నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీమతి పి. సరస్వతి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

**కాలనీల నుంచి మురికివాడల వరకు..**

జిల్లెలగూడ దాసరాయణ కాలనీ, మీర్పేట్ లెనిన్ నగర్ డబుల్ బెడ్రూమ్ నివాస ప్రాంతాలు, బడంగ్పేట్ గాంధీ నగర్ వంటి ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది విస్తృతంగా పనులు చేపట్టారు. రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు, డ్రైనేజీ కాలువల పూడికతీత పనులను పూర్తి చేశారు. స్థానిక ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు.

**నిరంతర ప్రక్రియగా పరిశుభ్రత**

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. నగరవాసుల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ఈ 99 రోజుల ప్రణాళిక కొనసాగుతుందని తెలిపారు. కేవలం అధికారుల కృషితోనే కాకుండా, ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా చెత్తను రోడ్లపై వేయకుండా సహకరించాలని ఆమె కోరారు. మురికివాడల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ (DE) అభినయ్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ (AE) గంగ ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ (SI) యాదగిరి మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.








## 31న నగరంలో మాంసం విక్రయశాలల బంద్

* **మహావీర్ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ ఆదేశాలు**

హైదరాబాద్, మార్చి 24 (భారత శక్తి) : మహావీర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని అన్ని మాంసం విక్రయశాలలు, కబేళాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 533 (బి) ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**అమలులోకి రానున్న నిబంధనలు:**

* ఈ నెల 31న (31032026) నగరం అంతటా పశువులు, గొర్రెలు, మేకల కబేళాలు పూర్తిగా మూతపడనున్నాయి.
* రిటైల్ మాంసం దుకాణాలతో పాటు బీఫ్ విక్రయశాలలను కూడా మూసి ఉంచాలని స్పష్టం చేశారు.
* గతేడాది సెప్టెంబర్ 24న జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ తీర్మానం (నెం. 26) మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**పోలీసుల సహకారం:**

ఈ నిబంధనలు కఠినంగా అమలు అయ్యేలా చూడాలని, మున్సిపల్ సిబ్బందికి తగిన సహకారం అందించాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌ను జీహెచ్ఎంసీ కోరింది. ఆదేశాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

## విజయపురి కాలనీలో బీటీ రోడ్డు పనుల పరిశీలన



బీ.ఎన్. రెడ్డి నగర్, మార్చి 24 (భారత శక్తి) : డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్1లో కొత్తగా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పర్యవేక్షించారు. పనుల నాణ్యతను పరిశీలించిన ఆయన, కాలనీల సమగ్ర అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిబంధనల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తక్షణమే చొరవ చూపుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రావు, సభ్యులు శ్రీనివాస్ రావు, మాణిక్ ప్రభు పాల్గొన్నారు. అలాగే బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల జోలికొస్తే ఊచలు లెక్కపెట్టాల్సిందే!

* **నెల రోజుల్లో 181 మంది పోకిరీల అరెస్ట్: మల్కాజిగిరి డీసీపీ ఉషారాణి హెచ్చరిక**

ఎల్బీనగర్, మార్చి 24: భారత శక్తి) : ఆడబిడ్డల రక్షణే ధ్యేయంగా షీ టీమ్స్ (SHE Teams) ఉక్కుపాదం మోపుతున్నాయి. మహిళలు నిర్భయంగా తిరిగే వాతావరణం కల్పించడమే లక్ష్యంగా మల్కాజిగిరి ఉమెన్ సేఫ్టీ విభాగం అలుపెరగని నిఘా కొనసాగిస్తోంది. గడిచిన నెల రోజుల్లో (ఫిబ్రవరి 16నుండి మార్చి 15 వరకు) షీ టీమ్స్ నిర్వహించిన దాడులు, తీసుకున్న చర్యల వివరాలను డీసీపీ టి. ఉషారాణి మంగళవారం వెల్లడించారు. వేధింపులకు పాల్పడితే ఎంతటి వారినైనా విడిచిపెట్టే ప్రసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు.

* **ముసుగు వీడిన మృగాళ్లు: గణాంకాలు ఇవే..**

* బస్టాండ్లు, మెట్రో స్టేషన్లు, విద్యాసంస్థలే లక్ష్యంగా మఫ్టీలో ఉన్న షీ టీమ్స్ సభ్యులు పోకిరీల ఆటకట్టించారు. గత నెల రోజుల్లో నమోదైన గణాంకాలు పరిశీలిస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది:
* మొత్తం అరెస్టులు: 181 మంది (వీరిలో 148 మంది మేజర్లు కాగా, 33 మంది మైనర్లు ఉండటం గమనార్హం).
* అందిన ఫిర్యాదులు: 223.
* వేధింపుల రకాలు: * ఫోన్ కాల్స్ ద్వారా: 57
* సోషల్ మీడియా వేదికగా: 53
* ప్రత్యక్షంగా/శారీరక వేధింపులు: 113
* నమోదైన ఫిర్యాదుల్లో తీవ్రతను బట్టి 8 క్రిమినల్ కేసులు, 57 పెట్టీ కేసులు నమోదు చేయగా.. మిగిలిన 122 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.



**నమ్మించి మోసం.. వేధింపుల పర్వం:**

షీ టీమ్స్ ఛేధించిన కొన్ని కీలక కేసుల వివరాలను డీసీపీ వివరించారు:

* పెళ్లి పేరుతో వంచన: తోటి ఉద్యోగినిని ప్రేమ పేరుతో నమ్మించిన ఓ ప్రబుద్ధుడు, రహస్యంగా పెళ్లి చేసుకుని ఆమెను రెండుసార్లు గర్భస్రావానికి గురిచేశాడు. అంతటితో ఆగక బాధితురాలి నగలు, నగదుతో పరారయ్యాడు. షీ టీమ్స్ రంగంలోకి దిగి అతడిని కటకటాల వెనక్కి నెట్టాయి.
* విద్యార్థినికి బెదిరింపులు: పాత పరిచయంతో ఓ విద్యార్థినిని కళాశాల వద్ద వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. ఇంటిని ఖాళీ చేయించినా వదలకుండా, సోషల్ మీడియాలో ఫోటోలు పెడతానంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
* యజమాని వక్రీకృత బుద్ధి: ఆఫీసులో మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, అర్ధరాత్రి ఫోన్లలో వేధిస్తున్న ఒక ప్రైవేట్ కంపెనీ యజమానిని షీ టీమ్ అరెస్ట్ చేసింది.
* మెట్రోలోనూ నిఘా.. అవగాహనతో చైతన్యం మహిళల కోసం కేటాయించిన మెట్రో కోచ్‌లలో ప్రయాణిస్తున్న 6 గురు పురుషులకు జరిమానా విధించారు. కేవలం అరెస్టులే కాకుండా, సమాజంలో మార్పు కోసం షీ టీమ్స్ గత నెలలో 97 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సుమారు 14,715 మందికి చట్టాలపై అవగాహన కల్పించాయి.

**భయం వద్దు.. ఫిర్యాదు చేయండి!**

"మహిళలు ఎక్కడ ఉన్నా, ఏ సమయంలో ఉన్నా భయపడాల్సిన అవసరం లేదు. వేధింపులు ఎదురైతే వెంటనే మల్కాజిగిరి షీ టీమ్ వాట్సాప్ నంబర్ 8712662111 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి."

**— టి. ఉషారాణి, డీసీపీ, ఉమెన్ సేఫ్టీ**

జర్నలిస్టుల 'ఛలో హైదరాబాద్'కు

## జై స్వరాజ్ పార్టీ మద్దతు



హైదరాబాద్, మార్చి 24 (భారత శక్తి) : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించ తలపెట్టిన "ఛలో హైదరాబాద్" కార్యక్రమానికి జై స్వరాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం సిద్ధించి 11 ఏళ్లు గడిచినా జర్నలిస్టుల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**ముఖ్యాంశాలు:**

* ఇళ్ల స్థలాలు: అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి.
* అక్రిడిటేషన్లు: పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను తక్షణమే జారీ చేయాలి.
* పెన్షన్ సౌకర్యం: సీనియర్ జర్నలిస్టులకు నెలకు రూ. 25 వేల పెన్షన్ అందించాలి.
* బకాయిల విడుదల: చిన్న, మధ్య తరహా పత్రికలకు రావాల్సిన ప్రకటనల బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేన్నరేళ్లు గడిచినా వారి సంక్షేమాన్ని విస్మరించడం సరికాదని ఆయన విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం మానవీయ కోణంలో చూడాలని కోరారు. జర్నలిస్టుల న్యాయమైన పోరాటాలకు తమ పార్టీ అండగా ఉంటుందని కాసాని స్పష్టం చేశారు.

## కుటుంబాలకు బీమా కల్పించడం నేరమా? : భట్టి

హైదరాబాద్, మార్చి 24 (భారత శక్తి) : బడ్జెట్‌లో మేం ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడాన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా? అని నిలదీశారు. ''కుటుంబంలో పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటి కుటుంబాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని బీమా కల్పించాం. సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే.. వినడానికి బీఆర్ఎస్‌కు సమయం లేదా? క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కావాలని ఉద్యోగులు పదేళ్ల నుంచి అడుగుతూనే ఉన్నారు. గతంలో వారు మాట్లాడేందుకు కూడా భయపడే పరిస్థితి కల్పించారు.

* **లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన పారిజాత నర్సింహారెడ్డి.**



## నిరుపేదలకు భరోసా 'సీఎం సహాయనిధి'

బాలాపూర్, మార్చి 24 (భారత శక్తి) : అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) కొండంత అండగా నిలుస్తుందని మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ డివిజన్ పరిధిలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆమె లబ్ధిదారులకు అందజేశారు.

**ప్రభుత్వ సహకారంతో అండగా..**

ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుల సహకారంతో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఆపద కాలంలో వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**లబ్ధిదారుల వివరాలు:**

ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన ఇద్దరు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి.

కుళ్ళ జంపయ్య: రూ. 40,000/
దేవరత్ నందిని: రూ. 60,000/

వీరికి పారిజాత నర్సింహారెడ్డి స్వయంగా చెక్కులను అందజేసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నేతలు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు బలింగని జంగయ్య, కోలన్ తిరుపతి రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, సామ భాస్కర్ రెడ్డి, సిరిగని సాయి, గిరి ముదిరాజ్, మసూద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.